

- జిల్లా సమగ్రాభివృద్ధికే ప్రాధాన్యత
- ఇసుక ఉచితం.. నిర్వహణ ఖర్చులే..
- మదనపల్లె ఫైల్స్ వంటి సంఘటనలు జరగకుండా చర్యలు
- ఫ్రీహోల్డ్ ఫైళ్లపై రీ సర్వే
- ఇళ్ల నిర్మాణం వేగవంతానికి ప్రత్యేక చర్యలు
- ఆంధ్రజ్యోతితో కలెక్టర్ చామకూరి శ్రీధర్

విజన్ 2047తో జిల్లా రూపురేఖలు మారుస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): విజన్ 2047తో జిల్లా రూపురేఖలు మారుస్తాం.. జిల్లాలో ఉన్న ప్రాముఖ్యతలు ఏంటి..? 2047లో జిల్లాను ఏ విధంగా చూడాలి అనే విధంగా కసరత్తు జరుగుతోంది. ఈ విషయమై వంద రోజుల ప్రణాళికను ఇప్పటికే ఇచ్చాము. రాబోయే రోజుల్లో జిల్లా సమగ్రాభివృద్ధికే ప్రాధాన్యత ఇవ్వనున్నాము. జిల్లా నలుమూలల అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నాము. జిల్లా ప్రజలకు ఇసుకను పూర్తి ఉచితంగానే అందిస్తాం. ఇసుక కావాల్సిన వాళ్లు కేవలం నిర్వహణా ఖర్చులు పెట్టుకుంటే సరిపోతుంది. సరఫరాలో ఎటువంటి సమస్యలు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాము. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసుపై సీఐడీ విచారణ జరుగుతోంది. జిల్లాలో ఇక అటువంటి సంఘటనలు జరగకుండా.. అవసరమైన భద్రతా చర్యలు తీసుకున్నాము. ఫ్రీహోల్డ్ ఫైళ్లపై రీ సర్వే జరుగుతోంది. ఈ రీసర్వేలో అనేక అవకతవకలు బయటపడుతున్నాయి. వీటన్నింటినీ ప్రభుత్వానికి నివేదిక పంపనున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఐఏఎస్ అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం చేపట్టబోయే చర్యలపై ఆయన ఆంధ్రజ్యోతితో ఏమన్నారంటే. ఆయన మాటల్లోనే..

ఇసుక ఉచితం..

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతం నదుల్లో ఇసుకను తవ్వలేము. అక్టోబరు తర్వాతే.. అది సాధ్యం. దీంతో ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో సిల్ట్ అప్లికేషన్ ద్వారా ఇసుకను తవ్వుకోవచ్చు. దీంతో చెయ్యేరు నదిపై ఉన్న అన్నమయ్య రిజర్వాయర్ వద్ద అవకాశం ఉంది. నీటిపారుదల, గనులశాఖ అధికారుల సంయుక్త సర్వేలో రాజంపేట మండలం బాలరాజుపల్లె, బుడిగుంటపల్లె వద్ద అవకాశం ఉన్నట్లు గుర్తించారు. అక్కడ ఐదులక్షల మెట్రిక్ టన్నులు తవ్వుకోడానికి అవకాశం ఉండడంతో.. అక్కడ మూడు రీచ్‌లను గుర్తించారు. మొదట రీచ్ బుడిగుంటపల్లె దగ్గర, మరో రెండు కిలోమీటర్ల దూరం తర్వాత.. ఇంకో రీచ్ ఉంటుంది. కొద్ది దూరంలో ఇంకో రీచ్‌ను ఏర్పాటు చేశాము. ప్రస్తుతం మూడు రీచ్‌లు తెరిచాము. మొదటి రీచ్‌లోనే.. 2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఈ ఇసుకను ఎటువంటి యంత్రాలతో తవ్వకూడదు. కేవలం మనుషుల ద్వారా తవ్వి.. ట్రాక్టర్లకు నింపి.. అక్కడి నుంచి స్టాకు పాయింట్‌కు... అటు ఉంచి ప్రజలకు అందించాలి. గత ఐదు రోజులుగా జిల్లాలో ఇసుక అమ్మకాలు మొదలయ్యాయి. చెయ్యేరు నదిలో రోడ్డు ఏర్పాటు చేసి.. స్టాకు పాయింట్ వద్దకు ట్రాక్టర్లు, ట్రిప్పర్లు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశాము. ఈ రీచ్ నుంచి ప్రస్తుతం రోజుకు నాలుగు వేల మెట్రిక్ టన్నుల ఇసుకను అమ్ముతున్నాము. రాబోయే రోజుల్లో దీన్ని మరింత పెంచేందుకు ప్రయత్నిస్తాము. ప్రజలకు ఇస్తున్న ఇసుక ఉచితమే... కనీసం రూపాయి కూడా వసూలు చేయడం లేదు. అయితే నిర్వహణా ఖర్చుల కింద ఒక టన్నుకు రూ.328 ఖరారు చేశాము. ఒక ట్రాక్టర్ నింపేందుకు.. నాలుగున్నర టన్నులు తవ్వడానికి బాధ్యతలు ఇచ్చిన ఏజెన్సీకి టన్నుకు రూ.110 లెక్కన కూలి ఇస్తున్నాము. జిల్లాలో ఇసుక లభించనందున బుకింగ్ కోసం ఎగబడుతున్నారు. ఇసుకను రీచ్‌ల నుంచి ప్రజలకు తరలించేందుకు పలు వాహనాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీటి ద్వారానే తరలిస్తున్నాము. వీళ్లందరూ ఒకేసారి వస్తుండడంతో కొంత సమస్యగా ఉంది. దీంతో కొన్నిచోట్ల ఈ వాహనాల యజమానులే ఇసుకను బుక్ చేసుకుని... ప్రజలకు అమ్ముతున్నారు. ఈ విషయాన్ని గుర్తించాము. దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నాము. ఇసుక అమ్మకం, సరఫరాలో ఎటువంటి అక్రమాలు లేకుండా ఉండేందుకు త్వరలోనే ప్రభుత్వమే ఒక యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. దీని వల్ల ఎవరికి అవసరమైతే వాళ్లే ఇసుకను బుక్ చేసుకోవచ్చు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచుతున్నాము.

ఉద్దేశ్యపూర్వకంగానే.. మదనపల్లె ఫైల్స్

జూలై 21 రాత్రి 11.30 గంటల సమయంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలకమైన ఫైళ్లు దగ్ధమయ్యాయి. సుమారు 2000కు పైగా రన్నింగ్ ఫైళ్లు దగ్గమయ్యాయి. ఫోరెన్సిక్ నిపుణులు, పోలీసులు, డాగ్‌స్క్వాడ్ అన్ని రకాలుగా విచారించారు. ఇది ప్రమాదవశాత్తూ కాదు.. ఉద్దేశ్యపూర్వకంగానే చేశారని అధికారులు నిర్ధారణకు వచ్చారు. కాలిన ఫైళ్లలో ఫ్రీహోల్డ్, 22ఏ అసైన్‌మెంటు ఫైళ్లు ఉన్నాయి. ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లిన పలు ఫైళ్లలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేశారు. ఇంకా కొన్ని ఫైళ్లలో ఆర్డీవోల సంతకాలే ఫోర్జరీ చేశారు.సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందే ఇలా ఫోర్జరీ చేసినట్లు తెలిసింది. దీంతో కొందరు తహసీల్దార్లు, డీటీలు, ఆర్డీవోలు తమ సంతకాలు ఫోర్జరీ అని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన తర్వాత.. ప్రభుత్వం ఆదేశాల మేరకు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం, అన్ని ఆర్డీవో కార్యాలయాల వద్ద పోలీసుల రక్షణ ఏర్పాటు చేయించాము. ఫైళ్లను సక్రమంగా భద్రపర్చేందుకు ప్రతి తహసీల్దార్ కార్యాలయానికి అవసరమైన చోట బీరువాలు కొనుగోలు చేయమని చెప్పాము. భవిష్యత్తులో ఇక ఇటువంటి సంఘటనలు జరిగే అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాము.

ముమ్మరంగా ఫ్రీహోల్డ్ రీ వెరిఫికేషన్

జిల్లాలో 1,41,000 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశాము. 2003 అంతకంటే.. ముందు అసైన్‌మెంటు ఇచ్చిన అసైనీ, లేదా అతని వారసులు ఆ భూమిని అనుభవిస్తూ.. ఉండి.. ఇప్పటికీ వాళ్లే ఆ భూములను అనుభవిస్తూ ఉంటే.. వాళ్లకు ఫ్రీహోల్డ్ చేయడానికి అవకాశం ఉంది. ఇప్పటికి లక్షా 20 వేల ఎకరాలు రీ వెరిఫికేషన్ పూర్తయింది. ఇందులో 45 శాతం భూములు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ జరిగాయి. అసలైన అసైన్‌మెంటు పొందిన వ్యక్తుల చేతుల్లో భూములు లేకపోవడం. వాళ్ల వారసుల చేతుల్లో లేకపోయినా.. ఉన్నట్లు నమోదు చేయడం వంటి అక్రమాలు జరిగాయి. సుమారు 50 వేల ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ జరిగాయి. ఇందులో 4800 ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఫ్రీహోల్డ్ అయి.. ఎన్నికల సమయంలోనే రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. వీరబల్లి మండలంలో 256 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అందులో 100 రిజిస్ట్రేషన్లు చట్ట వ్యతిరేకంగా జరిగాయి. ఫ్రీ హోల్డ్ అయిన వ్యక్తి కాకుండా.. వాళ్ల వారసులు కాకుండా... మరెవరో రిజిస్ట్రేషన్లు చేయించారు. ఫ్రీహోల్డ్ అయిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించారు. జిల్లాలో సుమారు 4800 ఎకరాల్లో ఇలా జరిగాయి. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోంది. ప్రభుత్వానికి నివేదిక పంపించి చర్యలు తీసుకుంటాం.

రైతులను ఆదుకుంటాం

ఈ ఏడాది ఖరీఫ్‌లో అనుకున్న మేర వర్షపాతం పడలేదు. దీంతో వ్యవసాయం, ఉద్యాన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నాము. జూన్‌లో కొద్దిగా బాగానే వానలు పడినా.. జూలై, ఆగస్టులలో బాగా దెబ్బకొట్టింది. దీంతో పంటల సాగు విస్తీర్ణం కూడా బాగా తగ్గిపోయింది. ఇన్సూరెన్సు కవరేజ్ అయ్యే.. విధంగా నివేదికలు తయారు చేస్తున్నాము. వ్యవసాయం, ఉద్యానవనం రైతులు దెబ్బతిన్న వివరాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపిస్తున్నాము. జిల్లాలో కొన్ని చోట్ల తాగునీటి సమస్య కూడా ఉంది. సాధారణంగా సెప్టెంబరులో ఎక్కడా ట్యాంకర్లతో నీళ్లు తోలే పరిస్థితి ఉండదు. అయితే 40 ట్యాంకర్లు రోజూ నడుపుతున్నాము. గ్రౌండులెవల్ వాటర్ పూర్తిగా తగ్గిపోయింది. రాజంపేటలో 700 అడుగుల లోతు బోర్లు కూడా ఎండిపోయాయి. నీళ్లు రావడం లేదు.

విజన్ 2047 డాక్యుమెంటేషన్ జరుగుతోంది

సీఎం చంద్రబాబునాయుడు విజన్ 2047ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారు. జిల్లాలో ఉన్న ప్రాముఖ్యతలు ఏంటి..? 2047లో మీ జిల్లాను ఏ విధంగా చూడాలి అనే విధంగా కసరత్తు జరుగుతోంది. ఈ విషయమై 100 రోజుల ప్రణాళికను ఇప్పటికే ఇచ్చాము. 2047 విజన్ డాక్యుమెంటు తయారు చేయడానికి ప్లానింగ్ డిపార్ట్‌మెంటుకు శిక్షణ ఇస్తున్నాం. మిగిలిన శాఖలతో కూడా సమీక్షలు నిర్వహించి.. సమాచారాన్ని సేకరిస్తున్నాము. జిల్లాలో టూరిజం డెవలప్‌మెంటుకు ఉన్న అవకాశాలు పరిశీలించి.. హార్సిలీహిల్స్‌లో 20 ఎకరాల్లో ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం భూమి ఇచ్చింది. వాళ్లు కూడా భూమిని చూసుకున్నారు. రాబోయే రెండు మూడు నెలల్లో వాళ్లు కూడా పెట్టుబడులు చూసుకుని.. పనులు మొదలు పెడతారు. ఏపీఐఐసీ ద్వారా పెట్టిన క్లస్టర్లలో ఎక్కువగా మదనపల్లెలో డిమాండ్ ఉంది. మరోక చోట కూడా 500 ఎకరాలు భూమి సిద్ధం చేయడానికి తహసీల్దార్‌కు ఉత్తర్వులు ఇచ్చాము.

రైల్వేకోడూరులో ఆహార శుద్ధి పరిశ్రమ

రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో ఎక్కువగా అరటి, మామిడి పంటలు సాగయ్యాయి. ఇక్కడి మంచి నాణ్యమైన అరటి, మామిడి దిగుబడి వస్తాయి. ఆహారశుద్ధి పరిశ్రమలను ఈ ప్రాంతంలో ప్రోత్సహించి.. తక్కువ నీటి వాడకంతో ఏర్పాటయ్యే పరిశ్రమలను మదనపల్లె ప్రాంతంలో ప్రోత్సహించాలని విజన్ డాక్యుమెంటులో పొందుపరుస్తున్నాము. మన దగ్గర ఉన్న మామిడి ప్రపంచంలోనే నాణ్యమైనది. ఇటీవల జిల్లాకు డిప్యూటీ సీఎం వచ్చినప్పుడు రైల్వేకోడూరు ప్రాంతంలో ఆహారశుద్ధి పరిశ్రమను ఏర్పాటు చేయడానికి తగిన ప్రతిపాదనలు పంపమన్నారు.

స్కిల్ డెవలప్‌మెంటుకు ప్రాధాన్యత

ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా కువైత్, సౌదీ వంటి గల్ఫ్ దేశాలకు బతుకు దెరువుకు వెళ్తున్నారు. ఇక్కడ ఉన్న మనుషులకు ఉద్యోగాలు లేవు. భర్త జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్ళినా.. అతని భార్యకు ఏదో రంగంలో నైపుణ్యం ఉంటే.. ఆమె కూడా అక్కడికే వెళ్లవచ్చు. దీంతో ఆమెకు అక్కడ మంచి వేతనానికే ఉద్యోగాలు దొరికే అవకాశం ఉంది. విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే వ్యక్తులకు అక్కడ ఏం అవసరమో.. ఆ రంగంలో శిక్షణ ఇచ్చి పంపించేందుకు కార్యక్రమాలు సిద్ధం చేసుకుంటున్నాము.

కొత్త పథకం కింద ఇంటికి రూ.4.8 లక్షలు

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇళ్లు మంజూరైతే రూ.4.8 లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఇప్పటికే ఉన్న కాలనీలు, వ్యక్తిగతంగా కాలనీలలో ఇళ్లు కట్టుకుంటున్న వాళ్లకు ముందున్న పథకం ప్రకారమే డబ్బు వస్తుంది. ఆ పథకం కింద ఇంకా 7 వేల వరకు ఆర్‌సీ లెవెల్‌లో ఉన్నాయి. ఇవి కాక ఇంకా 30 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వాళ్లను ప్రోత్సహించి ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటాం. మన దగ్గర సిమెంటు, ఇనుము అందుబాటులో ఉంది. ఇసుక కూడా అందుబాటులోకి వచ్చింది. ప్రజలను ప్రోత్సహిస్తున్నాము. గతంలో ఏ పథకం కింద అయినా ఇళ్లు మంజూరై ఉంటే కొత్త పథకం కింద మంజూరు కాదు. జాయింట్ కలెక్టర్, రాజంపేట, మదనపల్లె సబ్‌కలెక్టర్లు ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేందుకు దృష్టి పెట్టనున్నారు.

పెన్షన్ల పంపిణీ భేష్

పెన్షన్ల పంపిణీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మొదటి రోజే.. శాశ్వత ఉద్యోగులను ఉపయోగించుకుని సుమారు 99 శాతం పంపిణీ చేశాము. అందుబాటులో లేని కొద్ది మందికి మరుసటి రోజు పంపిణీ చేశాము. సుమారు 95 శాతం 12 గంటల్లోపే పంపిణీ చేయగలిగాము. జిల్లాలోని అన్ని శాఖలు, అధికారులను సమన్వయం చేసుకుని.. జిల్లాను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం.

అప్పుల బాధతో వెళ్లి.. చిత్రహింసలతో తిరిగొచ్చా

- ఏజెంట్ మోసం చేయడంతో ఇబ్బందులు పడ్డా
- కువైత్ నుంచి స్వగ్రామానికి చేరిన తిరుపతి కవిత



భర్త పిల్లలతో సంతోషంగా ఉన్న కవిత


సంబేపల్లె, సెప్టెంబరు 14: అప్పుల బాధతో వెళ్లి.. చిత్రహింసలతో తిరిగి వచ్చానని తిరుపతి కవిత కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె శనివారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకుంది. తన భర్త పిల్లలతో సంతోషాన్ని పంచుకుంటూ కువైత్‌లో పడిన చిత్రహింసలను గుర్తు చేసుకొని బోరున ఏడ్చింది. తనను ఇక్కడికి రప్పించేందుకు కృషి చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాటల్లో...

తాము కూలిపనికి వెళితే కానీ పూటగడవదు. తన భర్త దివ్యాంగుడు కావడంతో కుటుంబ పోషణ భారమైంది. పిల్లలను పోషించుకోలేక ఇబ్బందులు పడ్డా. దీనికి తోడు రూ.7 లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాం. ఎలాగోలా తీర్చుకుందామనుకునే లోపే కరోనా మహమ్మారి దెబ్బకు కుదేలయ్యాం. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నందున తనకు ఉన్న ముగ్గురు కుమార్తెల్లో పెద్ద కుమార్తెను ఊరి సమీపంలో ఫ్యాక్టరీలో పనికి పెట్టాను. ఇక ఇలా అయితే అప్పులు తీరవని.. పది రూపాయలు సంపాదించుకోవాలనే ఆశతో ఈ ఏడాది జూన్ 26న కువైత్‌కు వెళ్లాను. అక్కడ పదిరోజులకే తనను వేధించడం మొదలు పెట్టారు. అయినా తన కుటుంబ పరిస్థితులు చూసి ఎంతో ఓర్చుకున్నా. రోజురోజుకు వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక సెల్ఫీ వీడియో విడుదల చేశాను. కాగా తనను ఇండియాకు రప్పించేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, రాంప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఏజెంటే మోసం చేశాడు

చాలా మంది.. ఏజెంట్లు చెప్పే మాటలకు బలైపోతున్నారని, తనకు అక్కడ చిన్నపిల్లలను చూసుకొనే పని అని చెప్పి.. తీరా అక్కడికి వెళ్లాక వంట పని కూడా చేయాలని వేధించారని తెలిపారు. దాంతో పాటు తనను చిత్రహింసలకు గురిచేశారని, ఏజెంట్‌కి ఫోన్ చేస్తే ఇళ్లు మార్చేది లేదంటూ ఫోన్ నెంబర్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంట్లో నుంచి పారిపోతే తనపై కేసు పెడతారని, తన బిడ్డలు, భర్త ఇబ్బందులు పడతారని భరించానని, కానీ చిత్రహింసలు ఆగకపోవడంతో దిక్కుతోచక ఇలా వచ్చేశానన్నారు. ఇలాంటి ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కువైత్‌లో చిక్కుకొన్న మహిళకు లోకేశ్ హామీ



షైమూన్

నిమ్మనపల్లి, సెప్టెంబరు 14: ఆర్థిక ఇబ్బందుల కారణంగా కువైత్‌లో ఇబ్బందులు పడుతున్న షైమూన్‌ను ఇండియాకు రప్పించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. కువైత్‌లో తాను పడుతున్న కష్టాలను ఆమె సోషియల్ మీడియా, ఆంధ్రజ్యోతి పత్రిక ద్వారా తనను ఈ నరకం నుంచి కాపాడాలంటూ గత నెల 27న మంత్రి లోకేశ్‌ను వేడుకొన్న సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. బాధిత మహిళను కాపాడి, ఇండియాకు తీసుకొస్తామంటూ హామీ ఇచ్చారు. శనివారం బాధితురాలు కుమారుడు సయ్యద్‌బాషా మాట్లాడుతూ నారాలోకేశ్ కార్యాలయం నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, తన తల్లిని కాపాడి అతి త్వరలో నిమ్మనపల్లికు చేర్చనున్నట్లు తెలిపారు. అలాగే తన తల్లితో ఫోన్ చేసి మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారని, తమ కుటుంబం తరఫున లోకేశ్ అన్నకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

రికార్డు స్థాయిలో వినాయక లడ్డూ వేలం

- రూ.17 లక్షలకు దక్కించుకున్న సర్పంచ్



సర్పంచ్ నాగార్జునాచారిని సన్మానిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 14: పట్టణ పరిధిలోని మదనపల్లి రోడ్డులో గల బీఎస్‌ఆర్ కాలనీలో జరిగిన లడ్డూ వేలంపాట రికార్డు స్థాయిలో నిలిచింది. చవితి పురస్కరించుకొని నిర్వాహకులు స్వామివారిని కొలువుదీర్చారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం లడ్డూ వేలంపాట నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇందులో టీడీపీ నాయకుడు, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి అత్యధికంగా లడ్డూను రూ.17 లక్షలకు, కలశం రూ.2.40 లక్షలకు దక్కించుకున్నారు. ఆదివారం ఉదయం కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా వారి ఇంటి వరకు సాగనంపే కార్యక్రమం ఉంటుందన్నారు. కాగా లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న సర్పంచ్‌ను టీడీపీ నేత మడితాటి శ్రీనివాసులరెడ్డి, కమిటీ నిర్వాహకులు దుశ్శాలువాతో సన్మానించారు.

వెంకన్నకు వేడుకగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 14: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం టీటీడీ ఆధ్వర్యంలో పవిత్ర సమర్పణ వేడుకగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకం, దూపదీప నైవేద్యాలు పూర్తి చేశారు. ఉదయం 10:45 గంటల నుంచి పవిత్రాలను మంగళవాయిద్యాలతో ఆలయంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామివారి మెడలో, శ్రీదేవి, భూదేవిలకు, ధ్వజస్తంభానికి, ప్రసన్న ఆంజనేయస్వామి వారికి, ఆలయం వెలుపల 12 మంది మూలవర్లకు సమర్పించారు. నాలుగో రోజైన ఆదివారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, వీధి ఉత్సవంతో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి.

కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, టీటీడీ ఆగమ సలహాదారు ఉభయ వేదాంత కాండూరి శ్రీనివాసాచార్యులు, ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, అర్చకుడు రమేష్, ఆలయ అధికారి దుశ్యంత్‌కుమార్, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'సెబ్' రద్దు నేపథ్యంలో.. ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ!

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు జవసత్వాలు
- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అజమాయిషీతో జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్లు
- కడపలో డిప్యూటీ కమిషనరుతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనరు
- రాయచోటిలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కార్యాలయం
- పూర్వ వైభవం రావడంతో ఎక్సైజ్ ఉద్యోగుల్లో హర్షం

కలికిరి, సెప్టెంబరు 14: నాలుగేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ-సెబ్)ను కొత్త ప్రభుత్వం సమూలంగా రద్దు పరిచి గతంలో వున్న ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించింది. ఈ మేరకు ఎస్‌ఈబీ ఏర్పాటు కోసం అప్పటి ప్రభుత్వం జారీ చేసిన 12 జీవోలను గంపగుత్తగా రద్దు చేసి తిరిగి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను పునరుద్ధరిస్తూ రాష్ట్ర డీజీపీ ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా ఆ మరుసటి రోజే రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ పరిధిలో 2020లో జారీ అయిన మరో నాలుగు జీవోలను కూడా ఆ శాఖ రద్దు చేసింది. అంతేగాకుండా ఎస్‌ఈబీలో వున్న అధికారులు, ఉద్యోగులందరినీ నిర్వీర్యమై వున్న పూర్వ ఎక్సైజ్ శాఖకు బదిలీ చేసింది. దీంతో ఎస్‌ఈబీ పూర్తిగా కనుమరుగైంది. ఈ నేపథ్యంలోనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను పునర్వ్యవస్థీకరించి మొత్తం పాలనా వ్యవహారాలకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. అసలు ఈ ఎస్‌ఈబీ వ్యవహారమేమిటో కాస్త పరిశీలిస్తే.. 2020 జూలైకు ముందున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను వైసీపీ ప్రభుత్వం విడగొట్టి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసింది. అప్పటి వరకు మద్యం వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఎక్సైజ్ శాఖ ప్రధానమైన అధికారాలన్నీ ఎస్‌ఈబీకి కట్టబెట్టారు. ఎక్సైజ్ శాఖ దాదాపు నిర్వీర్యమైపోయింది. తొలుత ప్రభుత్వ మద్యం వ్యవహారాలను చూస్తున్న ఎస్‌ఈబీ ఆ తరువాత ఇసుక, గ్రానైట్ లాంటి మైనింగ్ వ్యవహారాలను, గంజాయి లాంటి మత్తు పదార్థాల నిరోధానికి, ఎర్రచందన రవాణా, అక్రమ మద్యం కట్టడి లాంటి వ్యవహారాలకు విస్తరించింది. దాదాపుగా అన్ని రకాల మాఫియాల కోసమే ఎస్‌ఈబీ ఏర్పాటైందన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. ఇక దీని సమాంతరంగా మిగిలిన ఎక్సైజ్ శాఖ పూర్వ వైభవం పూర్తిగా కోల్పోయి ఎలాంటి చెప్పుకోదగ్గ బాధ్యతలు, విధులు లేకుండా నామమాత్రమైంది. ప్రభుత్వ మద్యం షాపుల్లో అమ్మకాలను పర్యవేక్షించడం వరకే పరిమితమైంది. ఈ దశలోనే ఎస్‌ఈబీ రద్దు కావడంతో ఎక్సైజ్ శాఖ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుందని చెబుతున్నారు.

ఎక్సైజ్ జోన్లు, ఇతర కార్యాలయాల ఏర్పాటు

ఎస్‌ఈబీని రద్దు చేసిన వెంటనే అందులోని అధికారులు, ఉద్యోగులను సరాసరిన ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖకు బదలాయించింది. డిప్యుటేషన్ల పేరుతో ఎస్‌ఈబీలో తిష్ట వేసిన వారందరినీ వారి వారి మాతృ శాఖలకు వెనక్కి పంపేశారు. ఇక ఎక్సైజు పాలనా వ్యవహారాల కోసం జోన్‌లు, డివిజన్లు, జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు ఉమ్మడి జిల్లాల కోసం కడపలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ కార్యాలయం కోసం ఇప్పటికి ఒక ప్రొహి బిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, నలుగురు ఎస్‌ఐలు, ఇద్దరు కానిస్టేబుళ్లను కేటాయించారు. అంతేగాకుండా కడప, అన్నమయ్య జిల్లాల పరిధి కోసం కడపలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఈ కార్యాలయం కోసం డీసీతో పాటు 12 మంది వివిధ కేడర్‌ల సిబ్బందిని కేటాయించారు. అదే విధంగా కడపలోనే కడప, అన్నమయ్య జిల్లాల కోసం మరో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి ఏసీతో పాటు ఎక్సైజ్ సూపరింటెండెంటు, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎస్‌ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 11 మంది కానిస్టేబుళ్లతో పాటు ఆరుగురు సిబ్బందిని మంజూరు చేశారు. ఇక నెల్లూరుతో కలుపుకుని మొత్తం రాయలసీమ నాలుగు జిల్లాల కోసం తిరుపతిలో డిస్టిల్లరీస్ అసిస్టెంట్ కమిషనరు కార్యాలయం ఏర్పాటు కానుంది. దీని కోసం ఏసీతో కలిపి నలుగురు సిబ్బందిని కేటాయించారు. ఇక కడపలో, అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటిలో వేర్వేరుగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. రాయచోటి కార్యాలయానికి ఒక ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో పాటు 17 మంది సిబ్బందిని కేటాయించారు. ఇవి కాకుండా టాస్క్‌ఫోర్స్, చెక్‌పోస్టులు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, డిస్టిల్లరీ విభాగాలు, ఐఎంఎల్ డిపోలు విడిగా ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో 8 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లు

అన్నమయ్య జిల్లాకు సంబంధించి మొత్తం 8 చోట్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటవుతున్నాయి. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, కోడూరు, మదనపల్లె, మొలకలచెరువు, వాయల్పాడు, పీలేరు కేంద్రాలుగా సీఐ కేడర్ అజమాయిషీలో ఈ స్టేషన్లు పనిచేయనున్నాయి. ప్రతి స్టేషన్‌కు సీఐతో పాటు అవసరాన్ని బట్టి ఇద్దరు ముగ్గురు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 8 లేక 9 మంది కానిస్టేబుల్ పోస్టులను మంజూరు చేశారు. ఆయా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోకి వచ్చే మండలాలను కూడా ప్రభుత్వం నోటిపై చేసింది. రాయచోటి ఎక్సైజ్ స్టేషను పరిధిలోకి రాయచోటి, వీరబల్లి, చిన్నమండెం, సంబేపల్లె, సుండుపల్లె మండలాలను చేర్చారు. అదే విధంగా లక్కిరెడ్డిపల్లెకు.. లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలాలు, రాజంపేటకు.. రాజంపేట, పుల్లంపేట, పెనగలూరు, నందలూరు మండలాలు, కోడూరుకు... కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాలు, మొలకలచెరువుకు... మొలకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాలు, మదనపల్లెకు.. మదనపల్లె, కురబలకోట, నిమ్మనపల్లె, బికొత్తకోట, రామసముద్రం మండలాలు, వాయల్పాడుకు.. వాయల్పాడు, గుర్రంకొండ, కలికిరి మండలాలు, పీలేరు స్టేషన్ పరిధిలోకి పీలేరు, కేవీ పల్లె, కలకడ మండలాలను చేర్చారు.

ఎక్సైజ్ శాఖలో ఆనందోత్సాహాలు

దాదాపు నాలుగేళ్లుగా నిర్వీర్యమైన ఎక్సైజ్ శాఖను నెట్టుకొస్తున్న ఆ శాఖలోని ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు పెల్లుబికుతున్నాయి. తమ శాఖకు తిరిగి జవసత్వాలు రావడంతో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని, సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్ర చిత్రపటాలకు జిల్లాలో పలుచోట్ల శనివారం పాలాభిషేకాలు చేసి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఇన్నాళ్లు ఎస్‌ఈబీలో పనిచేస్తూ తిరిగి మాతృ శాఖకు వస్తున్న అధికారులు, ఉద్యోగులు కూడా ఆనందంగా ఉన్నట్లు చెబుతున్నారు.



సీఎం, ఎక్సైజ్ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పీలేరు ఎక్సైజ్ అధికారులు

కాల్వకు 'గంగ' సాగేనా



అట్లూరు వద్ద అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాల్వ

సాగర్‌లో నీరున్నా... కాల్వల్లో శూన్యమున్నా
సర్వేలతో సరి - నిర్మాణాలు ఎప్పుడు మరి
కుందూ పనులు ఎత్తిపోతలేనా ?



చుక్కనీరు లేక వెలవెలబోతున్న రెడ్డిచెరువు

అట్లూరు, సెప్టెంబరు 14: ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల తలరాతలు మారడంలేదు. తెలుగుగంగ కాల్వ పనులు పూర్తికాకపోవడంతో చెరువులకు నీరు నింపలేకున్నారు. ఫలితంగా రైతుల కళ్లల్లో కన్నీళ్లు తప్ప మరేమీ మిగలడంలేదు. పనులు పూర్తి కాకపోవడంతో బ్రహ్మంసాగర్‌లో నీరున్నా చెరువులకు చేరలేదు. అయితే కుందూ నది లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు 2019లో టెండర్లు జరిగినా ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఐదేళ్లుగా సర్వేలతోనే సరిపుచ్చుతున్నారే తప్ప భూసేకరణ పూర్తికాకపోవడం, నిర్మాణంలో చొరవలేక పనులు సాగడంలేదు. ఈ పనులు జరిగితే కనీసం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో 8 టీఎంసీల నీరు నిల్వ ఉంచుకునే అవకాశం కలుగుతుంది. వైసీపీ ప్రభుత్వంలో ఆగమేఘాలపైన పనులు చేపడతామని ఆర్భాటపు ప్రకటనలు చేసిందేతప్ప ఆచరణ శూన్యమని ఈ పనులే చెబుతున్నాయి. వివరాల్లోకెళితే....

అట్లూరు మండలంలోని తెలుగుగంగ కాల్వ పూర్తి కాక చెరువులకు నీరు నింపక రైతుల కళ్లల్లో కన్నీళ్లు సుడులు



కాల్వకు అడ్డంగా పోసిన మట్టిని తొలగించని కాంట్రాక్టర్

తిరుగుతున్నాయి. తెలుగుగంగ కుడి కాల్వకు పక్కనే వెంకటశెట్టిపల్లె చెరువు, రాజుపాలెం చెరువు, ఎర్రబల్లె చెరువు, లింగాల కుంట చెరువు, కుంభగిరి యాదాళ్ల చెరువు, కొండూరు వద్ద వనాయునవానల కుంట, ఎర్రచెరువు, రెడ్డిపల్లెవద్ద రెడ్డిచెరువు, అట్లూరు వద్ద కొత్తచెరువులకు మూడేళ్లగా తెలుగుగంగ నీరు చెరువుకు చేరలేదు. ఎడమ కాల్వకు కమలకూరు, మన్యంవారిపల్లె, మాడపూరు, కామసముద్రం, వేములూరు, ముతుకూరు గ్రామాల చెరువుకు నీరందక తెలుగుగంగ కాల్వ పూర్తి కాక చెరువుల్లో నీరు నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కుడికాల్వ పక్కనే ఉన్న 11 చెరువులకు ఎడమ కాల్వకు 6 చెరువులకు

దాదాపు 3వేల ఎకరాలు అసైన్డ్‌భూములు, పట్టా భూములున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, బడుగు, బలహీన వర్గాల రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వర్షాధార పంటలు వేసి సాగు చేసే రైతులే ఎక్కువ మంది. రూ.11 కోట్లతో వైసీపీ ప్రభుత్వంలో కంట్రాక్టర్ 2002లో కుడికాల్వ పనులు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు పనులు పూర్తి చేయక అసంపూర్తిగా ఉండడంతో బ్రహ్మంసాగర్‌లో నీరున్నా తెలుగుగంగ కాల్వకు నీరు సాగే పరిస్థితి లేదు. కంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే బిల్లులు సక్రమంగా రావడంలేదని ఇంకా రెండు నెలల్లో పనులు పూర్తి అవుతాయని చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా చెరువులకు చుక్క నీరు చేరకపోవడంతో ఖరీఫ్‌లో భూములు సాగుకు నోచుకోలేదు. రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం పెద్దలు, అధికారులు స్పందించి త్వరితగతంగా కాల్వ పనులు పూర్తి చేసి నీరు చెరువులకు అందించాలని అట్లూరు మండల రైతులు కోరుతున్నారు.

సర్వేలతోనే సరి.. నిర్మాణాలు ?

పోరుమామిళ్ల, సెప్టెంబరు 14: వెలుగొండ ద్వారా కాకుండా కుందూనది లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బ్రహ్మంసాగర్‌కు నీటిని సరఫరా చేస్తే నాలుగు నెలలకు ముందే రైతులకు నీరివ్వవచ్చు. ఈఉద్దేశంతోనే వైసీపీ ప్రభుత్వం కుందూనది వద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.419 కోట్లు నిధులు కేటాయించింది. అయితే 2019లో టెండర్లు జరిగినా ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఐదేళ్లుగా సర్వేలతోనే సరిపుచ్చుతున్నారే తప్ప భూసేకరణ పూర్తి కాలేకపోయింది. దువ్వూరు మండలం నేలటూరు వద్ద 2019 డిసెంబరు 23న ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. ఇంత వరకు నిర్మాణానికి నోచుకోకపోవడం అప్పటి పాలకుల నిర్లక్ష్యమేనని చెప్పుకోవచ్చు. నాలుగు రోస్టర్‌లకు సంబంధించి 2.2 డైపై పులైను, 5.545 కి.మీ పైపులైను ఫస్ట్‌ఫేస్‌లో 4.995, సెకండ్ కేటగిరీలో ప్లస్ 550 కి.మీ పైపులైను వేసేందుకు అంచనా రూపొందించారు. జొన్నవరం వద్ద పంప్‌హౌస్, నీలాపురం వద్ద మరో పంప్ హౌస్ నిర్మించి దాదాపు 8 టీఎంసీల వరద నీటిని 65 రోజుల్లో నిల్వ ఉంచి బ్రహ్మంసాగర్‌కు పంపాలనే అంచనాలు వేశారు. దీని కోసం విద్యుత్ సరఫరాకు 43.7 ఎండబ్ల్యు వెయిర్‌హైట్ 3.85 ఎంటి, లెన్త్ 370 ఎంటీ, అప్రోచ్ ఛానెల్ 300 మీటర్లు పొడవున్న తెలుగుగంగ మెయిన్‌కెనాల్‌కు సరఫరా చేసేందుకు అంచనాలు వేశారు. కానీ ఇంత వరకు ఈ పనులు ఊపందుకున్న పాపాన పోలేదు. దాదాపు 54.38 ఎకరాల భూములకు నష్టపరిహారం అందించాలని, ఇందులో మరో 18 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని గుర్తించారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయి ఉంటే వెలుగొండ ద్వారా వచ్చే నీటి కన్నా నాలుగునెలలు ముందుగానే సప్లిమెంటరీ వరదలతో వచ్చిన నీరు వృథా కాకుండా నిల్వ ఉంచు కుని నియోజకవర్గ ఆయకట్టుకు నీరందించే అవకాశాలున్నాయి. కానీ గత పాలకుల నిర్లక్ష్యంతక్ష ఐదేళ్లుగా సర్వేలతోనే కాలం వెల్లబుచ్చారు. వర్క్‌మాత్రం టెండరు అయి లిఫ్ట్‌ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేసి బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుకు 8 టీఎంసీల నీరు నిల్వ ఉంచుకునే అవకాశం కల్పించి రైతాంగాన్ని ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై తెలుగుగంగ ఈఈ క్రిష్ణారెడ్డిని వివరణ కోరగా కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు టెండర్లు జరిగాయి. సర్వే కూడా జరిగిందని, ల్యాండ్ అక్విజేషన్ సంబంధించి రైతులకు ప్రభుత్వం డబ్బు అందించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితే పనులు చేయించడానికి యంత్రాంగం సిద్ధమవుతుంది. కొత్త ప్రభుత్వంలో అయినా ఈ కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం కావాలని రైతులు ఎదురు చూస్తున్నారు.



కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల సర్వే నిర్వహిస్తున్న అప్పటి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఫైల్)

ప్రభుత్వం ఆదుకోవాలి



తెలుగుగంగ కాల్వ కింద ఐదెకరాల్లో చీనీ చెట్లు సాగు చేశాను. మూడేళ్లుగా తెలుగుగంగ కాల్వకు నీరు పారక చెరువుకు నీరు చేరక తాను వేసిన బోరు బావిలో నీరు అడుగంటుతోంది. చీనీ చెట్లకు నీరుపారుదల తగ్గుతుంది. కావున తెలుగుగంగ కాల్వ పూర్తి చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

బత్తల వెంకటసుబ్బయ్య, రైతు, కొండూరు

వరద బాధితులకు కానిస్టేబుల్ రూ.50 వేలు వితరణ

కడప (క్రైం), సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులకు ట్రాఫిక్ కానిస్టేబుల్ దస్తగిరి రాజు రూ50వేల చెక్‌ను అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడ సిటీలో మునిగిన విషయం తెలిసిందే వరద బాధితులకు తమవంతు సహాయం అందించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా దస్తగిరి రాజు (పీసీనెంబర్ 2903) రూ50వేల చెక్‌ను అందజేశారు. సీఐ జావిద్ అయనను ట్రాఫిక్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. సీఐ దస్తగిరి రాజును అభినందించారు.



దస్తగిరి రాజును సన్మానిస్తున్న సీఐ జావిద్

నేటి నుంచి దేవుని కడపలో పవిత్రోత్సవాలు

కడప (కల్చరల్) సెప్టెంబరు 14: తిరుమల తొలిగడప దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి 18వ తేదీ బుధవారం వరకు స్వామివారి పవిత్రోత్సవాలు కన్నుల పండువగా జరుగనున్నాయి. ఏడాదికో సారి జరిగే పవిత్రోత్సవాల్లో మొదటిరోజు సాయంత్రం 6 గంటలకు అంకురార్పణం, విశ్వక్ సేన పూజ, పుణ్యామవాచనం, అనుంగ రక్షాబంధనం, అఖండ దీపారాధన, జరుగనున్నాయి. 16న ద్వారా తోరణ, నిత్యహోమం, 17న పవిత్ర సమర్పణం, పవిత్ర హోమాలు, 18న మహా పూర్ణాహుతి, చతుష్టాణ ఉద్వాసనలు, కుంభప్రోక్షణ, పవిత్ర వితరణ, విద్వత్ సంభావన, జరుగనున్నట్లుఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

కొత్తకొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి

వేంపల్లె, సెప్టెంబరు 14: సాంకేతిక విద్య చదువుతున్న విద్యార్థులు కొత్తకొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని ఐబీఎం ప్రతినిధి నాగరాజు తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఐబీఎం స్కిల్‌డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఐదురోజుల పాటు విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన చేపట్టారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం, ఇతర రంగాల్లో ఏఏ ప్రాజెక్టులున్నాయి, ఎలాంటి శిక్షణ పొందితే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న విషయాలను తెలియజెప్పారు. వినూత్నంగా ఆలోచించి కొత్త ప్రయోగాలుచేసే విద్యార్థులకు విరివిగా అవకాశాలు ఉంటాయని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లను ప్రదానంచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్, డీన్ రత్నకుమారి, వినోద్ పాల్గొన్నారు.

బి.మఠం విద్యార్థినులకు చాంపియన్ ట్రోఫీ

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 14: కందిమల్లయ్యపల్లె జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు జెస్సీ, పి.ఉమామహేశ్వరి జంప్‌రోప్ చాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించారు. నియోజకవర్గం స్థాయిలో విజయం పొంది నంద్యాల జిల్లా పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికై మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో నిర్వహించిన 21వ సబ్ జూనియర్ జంప్‌రోప్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో 30 మంది విద్యార్థులు ఛాంపియన్ ట్రోఫీలో పాల్గొన్నారని పీడీ పి.పుష్పలత తెలిపారు.



చాంపియన్ ట్రోఫీ కప్‌ను అందుకుంటున్న బి.మఠం విద్యార్థినులు

సైక్లింగ్ పోటీలకు మోడల్ స్కూలు విద్యార్థులు

వల్లూరు, సెప్టెంబరు 14: ఏపీ మోడల్ స్కూలు ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ విద్యార్థినులు డి.మమత, ఎస్.పూజిత, టైం ట్రైలర్లో, నిత్య శ్రీ, ఎన్.దివ్యసాయి మార్షల్ సైక్లింగ్‌లో ఎంపికయ్యారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి అశోక్‌గౌడ మార్షల్‌లో మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు.

చదువుతో పాటు సమాజ జ్ఞానం పొందాలి

- లోకాయుక్త, ఆర్ట్సుకళాశాల పూర్వవిద్యార్థి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి



జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డిని సన్మానిస్తున్న వైవీయూ వీసీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: విద్యార్థులకు సమాజ జ్ఞానం అవసరం. చదువు సహా పాఠ్యేతర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లోకాయుక్త, ఆర్ట్సుకళాశాల పూర్వవిద్యార్థి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ ఆర్ట్సుకళాశాల ప్లాటినం జూబ్లీ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో పీయూసి డిగ్రీ చదివానని, విద్యార్థి యూనియన్ ఛైర్మన్‌గా క్రియాశీలకంగా వ్యవహరించానన్నారు. సమాజంలో జరిగే సంఘటనలపై కూడా ఆ రోజుల్లో స్పందించాం, నా ఎదుగుదలలో మా గురువుల పాత్ర చాలా గొప్పది. చాలకాలం తరువాత చదివిన కళాశాలకు రావడం పెద్ద అనుభూతినిచ్చింది. పాత మిత్రులను కలవడానికి అవకాశం కల్పించిన ప్లాటినం జూబ్లీ నిర్వహకులకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ కృషిని ప్రశంసించారు. వైవీయూ వీసీ క్రిష్ణారెడ్డి రాయలసీమలాంటి కరువు సీమలో ఈ కళాశాల ఎందరో విద్యార్థులను గొప్పగొప్ప స్థాయికి పంపిందంటే నాటి గురువుల అంకితభావం, క్రమశిక్షణ గొప్పదన్నారు. కారణాలు అన్వేషించాలని మేధావులు రోడ్‌మ్యాప్ తయారు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. విశ్రాంత ప్రిన్సిపాళ్లు సుబ్బిరెడ్డి, జనార్ధనరెడ్డి, ద్రవిడ యూనివర్శిటీ ప్రొఫెసరు కరీముల్లా పాల్గొన్నారు.

వినాయకుని ఊరేగింపులో అపశృతి

- ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి



కడప (క్రైం), సెప్టెంబరు 14: కడప నగరం ఆశోక్ నగర్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టర్ కింద పడి చెరువు పల్లి మధు (29) మృతి చెందినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కడప బుడ్డాయపల్లికి చెందిన మధు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి వినాయకుడి ఉరేగింపులో మధు ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య నాలుగేళ్ల కుమార్తె ఉంది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

మైలవరానికి నీటి విడుదల పెంపు

కొండాపురం,సెప్టెంబరు 14: గండికోట నుంచి మైలవరం జలాశయానికి శనివారం నీటి విడుదలను పెంచారు. శుక్రవారం 2500 క్యూసెక్కులు విడుదల చేయగా దానిని 5000 క్యూసెక్కులకు పెంచినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోటలో 25.5 టీఎంసీల నీటిమట్టం స్థిరంగా ఉండేలా అనుబంధ జలాశయాలకు నీటిని పంపుతామని డీఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 9700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఆయన తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయిర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మద్యం తాగుతున్నాడనీ....

● తండ్రి మందలిస్తే యువకుడు ఆత్మహత్య

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 14: మద్యం తాగవద్దని తండ్రి మందలించాడని చింతకుంట వెంకట్(18) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం చోటు చేసుకున్న ఘటన వివరాల్లోకెళితే.. స్థానిక సుందరయ్యనగర్ యువకుడు చింతకుంట వెంకట్ ఫొటో స్టుడియోలో పనిచేస్తున్నాడు. ఇటీవల తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో తండ్రి మందలించాడు. దీంతో వెంకట్ ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ విష్ణునారాయణ కేసు నమోదు చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, సెప్టెంబరు 14: దప్పెర్ల గ్రామం వద్ద బిజ్జం శివారెడ్డి (65) ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దముడియం మండలం కొండసుంకేసుల వాసి శివారెడ్డి కోవెలకుంట్లలో అద్దె ఇంట్లో ఒక్కడే నివాసం ఉండేవాడు. అనారోగ్యంతో ఇటీవల కర్నూలులో చికిత్స పొందాడని బంధువులు తెలిపారు. శనివారం కొండలో విషద్రావణం తాగి పడిపోయి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం కొండసుంకేసులలో బంధువులకు అర్బన్ పోలీసులు తెలియజేశారు.

కంప్యూటర్ ఆపరేటర్ రూ.2.56 లక్షలు స్వాహా

చాపాడు, సెప్టెంబరు 14: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ హానిక్‌బాష బద్రిపల్లె పంచాయతీలో రూ2.56 లక్షలు స్వాహా చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. జనవరి నుంచి పలు విడతలుగా 15వ ఫైనాన్స్ నిధులను ఇతరుల బ్యాంకు ఖాతాల్లోకి పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం భద్రిపల్లె సర్పంచ్‌గా గుత్తి మల్లీశ్వరి ఉన్నారు. హానిక్‌బాష స్వాహా చేసిన నిధులను మూడు రోజుల్లో రికవరీ చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ సీజ్

కొండాపురం,సెప్టెంబరు 14: బెడుదూరు వద్ద పోలీసులు ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. చిత్రావతి నది నుంచి శనివారం ఇసుక ను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గండికోటను సందర్శించిన కలెక్టర్

జమ్మలమడుగు, సెప్టెంబరు 14: పర్యాటక ప్రాంతం గండికోటను కలెక్టర్ లోతేటి శివశంకర్, ఇతర అధికారులు సందర్శించారు. శనివారం గండికోటలో ఓబెరాయ్ హోటళ్లకు గత ప్రభుత్వం కేటాయించిన స్థలాలను, ఆ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి గుర్రపుశాలను, జుమ్మా మసీదు, తదితర ప్రాంతాల్లో సందర్శించారు. అనంతరం సాయంత్రం గండికోట అడ్వెంచర్ భవనాల్లో సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27న పర్యాటక ఉత్సవాలను పురస్కరించుకుని గండికోటలో అభివృద్ధిపై చర్చించారు. పర్యాటకులకు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కోట ఎదురుగా స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కొందరు కోరినట్లు తెలుస్తోంది. అయితే సమావేశంలో గండికోట పరిసర ప్రాంతం చుట్టూ అభివృద్ధికోసం పర్యాటకుల కోసం పార్కులు, వాహనాల పార్కింగ్, ఎంట్రీ టిక్కెట్లు, గుర్రపుశాల తదితర ప్రాంతాలపై చర్చించారు. గండికోట లోయ పక్కన ఉన్న టెంట్లకు అనుమతులు ఉన్నాయా లేదా అన్న దానిపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అనధికారికంగా వేస్తున్న టెంట్లకు, బాడుగ రూములకు పంచాయతీ అభివృద్ధి కోసం కొంత డబ్బు వసూలు చేసి గ్రామం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, స్థానిక అధికారులు చర్చించినట్లుగా తెలుస్తోంది.



అడ్వెంచర్ భవనంలోని సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చుట్టూ రోడ్లు ఏర్పాటు చేయాలని వినతి

నియోజకవర్గంలో ప్రధాన పర్యాటక ప్రాంతం గండికోట. గండికోటకు పర్యాటకులు అనంతపురం, కర్నూలు, హైదరాబాదు, చెన్నై, దూర ప్రాంతాల నుంచి అధికంగా వస్తున్నారు. ఆ విధంగా గండికోటను కనెక్టివిటీ రోడ్లు చుట్టుపక్కల వేయాలని జమ్మలమడుగు ప్రాంత సీనియర్ న్యాయవాది మురళీధర్‌రెడ్డి, కాంట్రాక్టర్ ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి, ఈశ్వర్, తదితరులు కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి

ప్రతిభావంతులకు బంగారు పతకాలు ● 75 వసంతాల వేడుకలో పూర్వవిద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: విద్యాబుద్ధులు వినయ సంపన్నత నేర్పి జీవితమంటే ఏమిటో అవగాహన కల్పించి సమాజంలో గౌరవంగా బతికేలా తయారు చేసిన ప్రభుత్వ ఆర్ట్సుకళాశాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో ఉద్ఘాటించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు బంగారు పతకాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. శనివారం కడప నగరం ఆర్ట్స్ కళాశాల 75వసంతాలు పూర్తి చేసుకుని ప్లాటినం జూబ్లీ ఉత్సవాల ముగింపు సమావేశంలో పూర్వవిద్యార్థి కేరళ టూరిజం డిపార్టుమెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులంతా ఒకటిగా తయారై ఇప్పటికీ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కళాశాలను దీర్ఘకాలం తరువాత చూస్తూనే నాటి రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. ఏపీ విశ్రాంత డీఐజీ లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ డబ్బు సంపాదించాక దానిని సామాజిక అవసరాలకు వెచ్చించాలని, ఫలితంగా జీవన కాలం పెరుగుతుందన్నారు. హిమాచల్ ప్రదేశ్ విశ్రాంత కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఎ.రెడ్డి మాట్లాడుతూ పేదల కళాశాల ఆర్ట్స్ కాలేజీ అని, ఎందరో నాలాంటి వారికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చిందన్నారు. ఇక్కడ టీచర్ల అంకితభావం నిబద్ధత గొప్పదన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివి తే ఏమవుతారంటే ఇలా సివిల్ సర్వెంట్ అవుతారని చెప్పాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్‌శ్రీనివాసరెడ్డి మాట్లాడు తూ ఈ కళాశాలలో చదివిన వారు విభిన్నరంగాల్లో రాణించాలని ఉదహరించారు. కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం ద్వారా నిధులు ఖచ్చితంగా తెప్పించి ప్రగతి దిశగా తీసుకువెళతామన్నారు. విశ్రాంత మున్సిపల్ కమిషనర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీకాం కోర్సులో ప్రతిభావంతులకు బంగారు పతకం కోసం ఏటా 50వేలు ఇస్తానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ వెంకటశివారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ చదువు నేర్పిన కళాశాలకు ఎమ్మెల్సీగా కొంత రుణం తీర్చుకున్నానన్నారు. హైదరాబాదు ప్రఖ్యాత రచయిత ఉషారాణి మాట్లాడుతూ గుప్పెడంత మనసు అనే టీవీ సీరియల్‌లో రుషి క్యారెక్టరును నాటి ఆధ్యాపకుడు కథగా తీసుకుని రాశారంటే ఆ రోజుల్లో అధ్యాపక ఆదర్శనీయ జీవితం ఎంత గొప్పగా ఉందో చెప్పుకోవచ్చన్నారు. చైతన్యకెమికల్స్ అధిపతి రామ్మూర్తి, ఎస్‌కే యూనివర్శిటీ ప్రొఫెసరు ఎంఆర్‌కె రెడ్డి నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకన్నారు. కళాశాల ప్రతిభావంతుల కోసం శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డుగ్రహీత టీఎల్ఎస్ ప్రకాశ్ రూ.2లక్షలు ప్రకటించారు. పూర్వవిద్యార్థులను కళాశాల తరపున ప్రిన్సిపాల్ ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్వీ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రారు, కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సమన్వయకర్త ప్రొఫెసరు రాజశేఖర్ రెడ్డి, అలుమ్ని కార్యదర్శి కె.శివరాం, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



కేరళ టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ కె.శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, పూర్వవిద్యార్థులు

అధికారుల కొరత.. సమస్యల మోత



చిట్వేలి, సెప్టెంబరు 14: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని కార్యాలయాలకు కలిపి దాదాపు 70 మంది పైగా అధికారుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూ కార్యాలయంలో..

ఇక్కడ తహసీల్దారుగా పని చేస్తున్న భువనేశ్వరి మూడు నెలల క్రితం మెడికల్ లీవుపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆర్ఎస్ డ్యూటీలో ఉన్న సుమనికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే, రెగ్యులర్ తహసీల్దారు లేకపోవడంతో కీలకమైన పనులు జరగక రైతులు, విద్యార్థులు ఇతర వర్గాలవారు కార్యాలయం చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేస్తూ అవస్థలు పడుతున్నారు.

వ్యవసాయ, ఉద్యానశాఖలో..

మండలంలో అరటి, మామిడి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇక్కడ అధికశాతం వ్యవసాయమే జీవనాధారం. ఇలాంటి ప్రాంతంలో. వ్యవసాయ, ఉద్యానశాఖల్లో అధికారుల కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు సచివాలయాల్లో సైతం సిబ్బంది లేకపోవడంతో ఒక పంచాయతిలో పంపిణీ చేయాల్సిన ఎరువులను వేరే పంచాయతీలో ఉంచి అక్కడి నుంచి రైతులకు అందిస్తున్నారు. కాగా సిబ్బంది కొరత అంశాన్ని మండల వ్యవసాయాధికారి సందీప్, ఉద్యానశాఖ అధికారి ఆసియా ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. వ్యవసాయశాఖలో నేతివారిపల్లె, నగిరిపాడు, మార్లోపల్లె, చిట్వేలి-1, సి.కందులవారి పల్లెల్లో సిబ్బంది కొరత ఉంది. అలాగే ఉద్యానశాఖలోని నేతివారిపల్లె, నగిరిపాడు, చిట్వేలి-1, సి.కందుల వారిపల్లె, మార్లోపల్లెల్లో సిబ్బంది కొరత ఉంది.

40 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులే..

ఉపాధ్యాయుల కొరతతో మండలంలోని పాఠశాలలు కునారిల్లుతున్నాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో కలిపి 40 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. మండలంలో 58 ప్రాథమిక పాఠశాలలుండగా 40 పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే పని చేస్తున్నారు. ఇక ఉర్దూ పాఠశాలలో ఐదేళ్లుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ముస్లింలు జిల్లా అధికారులకు సైతం వినతిపత్రాలు సమర్పించారు.

సచివాలయాల్లో..

మండలంలో 13 గ్రామ సచివాలయాలు ఉండగా నేతివారిపల్లె, తిమ్మయ్యగారిపల్లె, సి.కందులవారిపల్లె, మార్లోపల్లె, కేఎస్ అగ్రహారం, రాజుకుంట, చిట్వేలి-2ల్లో గ్రామ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ముగ్గురు, ఏడుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ముగ్గురు మహిళా పోలీసులు, ఎంపీడీవో కార్యాలయంలో ముగ్గురు సిబ్బంది తక్కువగా ఉన్నారు.

. చిట్వేలి మండలం జిల్లాలోనే మారుమూల మండలం కావడంతో ఇక్కడికి వచ్చేందుకు ప్రభుత్వ ఉద్యోగులెవరూ మక్కువ చూపడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని అన్నిశాఖల్లో అధికారులు కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక రీచ్ ఆపాలని మహిళ ఆందోళన

సిద్దవటం, సెప్టెంబరు 14 : తన భూమి సమీపంలో ఇసుక రీచ్‌ను ఆపాలంటూ మండలంలోని జ్యోతి వద్ద ఉన్న ప్రభుత్వ ఇసుక డంపింగ్ కేంద్రానికి వాహనాలు వెళ్లకుండా వెంకట సుబ్బమ్మ అనే మహిళ అడ్డుకుని ఆందోళన చేశారు. దీంతో తహసీల్దారు మురాషావలి అక్కడికి చేరుకుని ఆ మహిళతో మాట్లాడారు. ఆ మహిళ చెబుతున్న, సర్వేనంబరు 143/1, 143/2ను ప్రభుత్వ భూమిగా నిర్ధారించామని, ఆ భూమిపై ఆమెకు ఎలాంటి హక్కు లేదన్నారు. సిద్దవటం మండల ఎస్ఐ చిరం జీవి ఆధ్వర్యంలో మహిళా పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.


మహిళను తీసుకెళుతున్న పోలీసులు

వైద్యుల సమ్మెతో ఓపీ సేవలు బంద్

నందలూరు, సెప్టెంబరు 14 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శనివారం నల్లరిబ్బన్ ధరించి సమ్మె చేయడంతో ఓపీ సేవలు బంద్ అయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్ మాట్లాడుతూ గతంలో పీహెచ్‌సీలో 3 సంవత్సరాలు పనిచేసిన వైద్యులకు పీజీలో చేరేందుకు 30 శాతం రిజర్వేషన్ ఉండేదని తెలిపారు. ఈ ప్రభుత్వం ఇన్ సర్వీస్ కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అన్ని బ్రాంచ్‌ల్లో చేరే అవకాశం ఉండేదని, నేడు కేవలం 6 బ్రాంచ్‌లకే పరిమితం చేయడం అన్యాయమన్నారు. సమ్మెకాలంలో కేవలం ఎమర్జెన్సీ సేవలు అందిస్తామని తెలిపారు.

మండల స్థాయి ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 14: మండల స్థాయి ఆటల పోటీల్లో రాయలసీమ విజ్‌డం అకాడమీ విద్యార్థులు రాణించారు. శనివారం ఆయా విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. ఈ నెల 20 నుంచి 22 వరకు నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ పీ. శ్రావణి, వ్యాయామ ఉపాధ్యాయుడు జే. అమర్నాథ్ తెలిపారు. వి. మనోజ్ఞ, కీర్తి, నిమాజిం, ఉమర్, షామీర్, లోకేష్, శ్రావ్య, ఉమేష్‌చంద్ర, హర్షవర్ధన్, ఆయేషా, సుల్తానా, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చు.. అధిక ఆదాయం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 14: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ఎంపీపీ బుల్లయ్య తెలిపారు. రైతులు రసాయన రహిత సేద్యం వైపు మొగ్గు చూపాలని తద్వారా ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. వివిధ రకాల కషాయాలను వినియోగించడం ద్వారా క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నఓరంపాడు, నడింపల్లె రైతులు పాల్గొన్నారు.

చిట్వేలి ఉపాధ్యాయులకు సర్వేపల్లి అవార్డు

చిట్వేలి, సెప్టెంబరు 14 : సర్వేపల్లె రాధాకృష్ణన్ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికైన స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు పసుపుల రాజశేఖర్ శనివారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. ఈ మేరకు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ వీవీ గిరి, ఫార్మర్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ప్రొఫెసర్ కనకాల రత్నయ్య, ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఎస్‌కే కరీముల్లా పాల్గొన్నారు.

భువనగిరి ఆలయానికి రూ.లక్ష విరాళం

రాజంపేట, సెప్టెంబరు 14 : మండలం లోని భువనగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి భువనగిరి పల్లెకు చెందిన వరికూటి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు 1,00,116 రూపాయలు అందజేశారు. తమ తండ్రి వరికూటి నరసింహులు జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అంద జేస్తున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ ధర్మకర్తలు కేఎస్ నరసింహ, కావేరిగారి వెంకటరమణ, కంబాయిగారి సుబ్బరాయుడు ఈ విరాళాన్ని అందజేశారు.

కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించాలి

రాజంపేట, సెప్టెంబరు 14: స్థానిక టీడీపీ నాయకుడు గన్నే సుబ్బనరసయ్య శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చిం చారు. కష్టపడిన తమ లాంటివారికి ప్రభుత్వ కార్పొరేషన్ పదవుల్లో స్థానం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రాజంపేటలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అన్ని ఆలోచించి సరైన సమయంలో సరైన నిర్ణ యం తీసుకుంటామని నారా లోకేష్ తెలియజేసినట్లు సుబ్బ నరసయ్య వివరించారు.

నేటి నుంచి పాత రాయచోటి దర్గాలో ఉరుసు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 14: పాత రాయచోటిలోని హజరత్ జమాలుల్లా బాబా దర్గాలో ఈ నెల 15వ తేదీ నుంచి ఉరుసు నిర్వహించనున్నారు. ఆదివారం గంధం ఊరేగింపుతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 16వ తేదీ సోమవారం మధ్యాహ్నం దర్గా ఆవరణలో అన్నదానం, సాయంత్రం ఉరుసు, 17వ తేదీ మంళవారం తహలీల్ ఫాతేహా తో ముగుస్తాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి: యూటీఎఫ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 14: సర్దుబాటు పేరుతో సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి సబ్జెక్టు ఉపాధ్యాయుల కుటుంబాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని, అలాంటి వారిని గుర్తించి ప్రస్తుతం పనిచేస్తున్న స్థానిక మండలం లేదా సమీప మండలాల్లో విధులు కేటాయించాలని శనివారం యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. నూతన రెవెన్యూ డివిజన్ల ఆధారంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడంతో కొంత మంది ఉపాధ్యాయులు వంద కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు బదిలీ అయ్యారని, దీంతో వారి పిల్లల చదువులు, వృద్ధ తల్లిదండ్రుల అనారోగ్య సమస్యల కారణంగా నివాసాన్ని మార్చలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భార్యా భర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులైతే మరిన్ని ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. సాంకేతిక కారణాలతో కొన్ని మండలాల్లో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను అవసరం లేని పాఠశాలలకు కేటాయించడం ఇదే సందర్భంలో అవసరం ఉన్న చోట కేటాయించలేక పోవడం వంటి అసంబద్ధాలు కూడా జరిగాయని తెలియజేశారు. ఈ విధంగా పని సర్దుబాటులో ఏర్పడిన ఇబ్బందులను తొలగించి సవరణ ఉత్తర్వులు ఇచ్చుటకు చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు విన్నవించగా వారు సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. యూటీఎఫ్ నాయకులు శ్యాం సుందర్, రవినాయక్ పాల్గొన్నారు.


జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

ఆడపూరు సర్పంచ్ టీడీపీలో చేరిక

నందలూరు, సెప్టెంబరు 14 : మండలంలోని ఆడపూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ నందలూరు చైతన్యభారతి తన అనుచరులతో కలిసి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి సమక్షంలో శనివారం తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపూరులో టీడీపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. మేడా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతో సర్పంచులకు మళ్లీ మంచి రోజులొచ్చాయని తెలిపారు. ఇది శుభారంభం మాత్రమే అని ఇక్కడ నుండి పెను తుపాను మొదలవుతుందని, నియోజకవర్గంలో వైసీపీని నేలమట్టం చేసే వరకు తాను ఆగేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఎద్దుల విజయసాగర్, నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన సర్పంచ్ నందలూరు చైతన్యభారతి

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : చమర్తి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 14 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకుంటామని రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు హామీ ఇచ్చారు. సిద్దవటం మండలం మాధవరం-1 వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాలాబాదుకు చెందిన సుభాన్‌బాషా, కొత్త మాధవరానికి చెందిన రమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెండు బాధిత కుటుంబాలు బడుగు బలహీన వర్గాలకు చెందినవే కావడం, ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు శ్రీనివాసులు, శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 14: స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం అన్న మయ్య జిల్లా ఎక్సైజ్ సూపరిం టెండెంట్ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలసి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ విభాగాలను ఏకీకృతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రొహిబిషన్ జాయింట్ యాక్షన్‌కమిటీ ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ అన్ని కార్యాలయాల్లో చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారని తెలిపారు. ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం ఎక్సైజ్‌శాఖ పోలీసుస్టేషన్‌లో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎక్సైజ్‌శాఖను రెండు భాగాలుగా విడగొట్టి ఎస్ఈబీ ఏర్పాటు చేశారని, దీంతో ఎక్సైజ్‌శాఖ పూర్తిగా మరుగున పడిందని, ఎక్సైజ్‌శాఖకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ చర్యలు తీసుకోవడం చాలా సంతోషకరమన్నారు.

రాజంపేట: వైసీపీ హయాంలో ఏర్పాటు చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టీడీపీ ప్రభుత్వం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖగా మార్చినట్లు ఆ శాఖ సీఐ పవన్‌కుమార్ తెలిపారు. రాజంపేట డివిజన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న, బెల్టుషాపులు నిర్వహిస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల తరలింపు, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ చిదంబం, పృథ్వీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం

రాయచోటిటౌన్, సెప్టెంబరు14: రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, గత వైసీపీ పాలనలో బడి నుండి గుడి వరకు ప్రజల ఆస్తులన్నీ తాకట్టు పెట్టిన దుర్మార్గుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శని వారం ఆయన రాయచోటి టీడీపీ కార్యాలయంలో మీడియా తో మాట్లాడారు. టీడీపీ నాయకులు అంజద్‌అలీఖాన్, చిన్నమండెం రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 106 కేసులు పరిష్కారం


కేసులను విచారిస్తున్న న్యాయమూర్తులు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 14: పట్టణంలోని జిల్లా ఐదవ అదనపు కోర్టులో శనివారం నిర్వహిం చిన జాతీయ లోక్ అదాలత్‌లో 106 కేసులు పరిష్కరించారు. వీటిలో క్రిమినల్, ఎంవీవోపీ యాక్ట్, యాక్సిడెంట్, చెక్‌బౌన్స్, ఎన్ఐ యాక్ట్, ఇన్సూరెన్స్‌కు సంబంధిం చిన కేసులున్నాయి. ఐదవ అద నపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫాసుల్తాన్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఆరద ఇరు పార్టీల కక్షిదారులతో మాట్లాడి రాజీమార్గం ద్వారా పరిష్కరించడంతో పాటు, 2,10,554,797 రూపాయలు పరిహారాన్ని చెల్లించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవా సమితి సభ్యులు రాజకుమారిచంద్ర, ఖాదర్‌బాషా, ధనుంజయ్‌కుమార్, అజ్మతుల్లా, వీరభద్రయ్య, నాగేశ్వరరావు, వెంకట్రమణ, శ్రీధర్ మూర్తి తదితర న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది శ్రీవాణి, మేనక, రాజేశ్వరి, రమణ, నరసింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది, ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: రాజీ పడడమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా తెలి పారు. శనివారం లక్కిరెడ్డిపల్లె కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భం గా 58 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామాల్లో భూ తగాదాలు, చిన్న చిన్న గొడవలు, ఇంటి స్థలాలు సమస్యలు గ్రామంలోనే పరిష్క రించుకోవాలని, ప్రతి సారి పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగద్దని కక్షిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, రెడ్డెన్న, చెన్నకృష్ణయ్య, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నేతలపై ఆరోపణలు.. సోషల్ మీడియాలో హల్‌చల్

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 14: మండలంలోని మైసూరివారిపలెకు చెందిన ఓ మహిళ సోషల్ మీడియా వేదికగా జనసేన రైల్వేకోడూరుకు చెందిన నలుగురు నాయకులపై చేసిన వీడియో హల్‌చల్ చేసింది. గత నెల 23న ఉప పవన్‌కళ్యాణ్ పర్యటనలో ఆయన దృష్టికి స్థానిక సమస్యలను తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నాలను వారు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.వారి భూ దందాలు, సెటిలిమెంట్లు బయటపడతాయో అని బెదిరించి నోరు నొక్కారని తెలిపింది. తన భర్త కూడా వీరికి సహకరించారని ఆరోపించింది. ఈ విషయం పై పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని తెలిపింది. ఇది ఇలా ఉండగా తనపై ఆరోపణలు నిరూపిస్తే జనసేన సభ్యత్వానికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి నిష్క్రమిస్తామని ఆ నలుగురిలో ఓ నేత తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

రామాపురం, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి సభ్యులు అంజనారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి వచ్చేవారు తమ ఆధార్‌కార్డు తీసుకొని రావాలని షుగర్, బీపీ వ్యాధులు ఉండేవారు సంబంధిత డాక్టర్ల రిపోర్టులు తీసుకొని రావాలని కోరారు. రామాపురం మండలంలోని 13 గ్రామ పంచాయతీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

In the Court of the Addl. Senior Civil Judge, Madanapalle
O.S.No. 314/2008

Plaintiff:
Shaik Mahaboob Basha
Defendant:
M.S.Ameerullah Basha and Others

Suit Summons to Defendant -51 in O.S.No.314/2008

D51) S.Dakshinya Sai S/o Late S.Kashi Viswanatham, D.No.50/6, Kothapeta, Rayachoti Town Now Annamayya (Dist)

పై దావాలో మీకు అనగా 51వ ప్రతివాదికి అనేక మార్లు కోర్టు మరియు పోస్టు ద్వారా దావా సమన్లు పంపగా మీరు తీసుకొనక వృధా కాలయాపన దురుద్దేశ్యపూర్వకముగా చేయుచున్నారు. కాన పై తెల్పిన కోర్టులో పై దావాలో నేరులోగానీ లేక నిర్దీత అడ్వకేట్ ద్వారా గానీ 03.10.2024వ తేదీన ఉ॥ 10.30గంటలకు హాజరగుటకు గాను వాయిదా యున్నది. మీరు పై వాయిదాకు హాజరు కానంతట కోర్టువారు మా పరీక్షమున తగువుత్తర్వులు పాలించెందరని తెలియపరచడమైనది.

"By Order of the Court"

సరస సుబ్రమణ్యం
B.A., LL.B.,
న్యాయవాది, డి.నెం.2-413-సి-2,
రామాలయం వీధి,
(సొసైటి కాలనీ), మదనపల్లె-517325

మదనపల్లి
తేది 14.09.2024

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవం నిర్వహించుకోవాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో పూజలు నిర్వహించారు.

2.20 లక్షలు పలికిన కొత్తపల్లి గణేష్ లడ్డూ

పెనగలూరు: చవితి ఉత్సవాల్లో భాగంగా పి.కొత్తపల్లెలో తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు నిర్మించిన మండపంలో శనివారం రాత్రి వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. ఎగువ కొత్తపల్లెకు చెందిన శివశంకర్ ఇంజనీరింగ్ వర్క్స్ యజమాని నీలపూజ రుద్రాచారి కుమారులు ఎన్.హరికృష్ణ, ఎన్.శివకృష్ణ 100 కిలోల లడ్డూ ప్రసాదాన్ని 2.20 లక్షల రూపాయలకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవాయిద్యాల నడుమ రుద్రాచారి ఇంటివరకు సాగనంపారు. సిద్ధి బుద్ధి సమేత వినాయకుడిని కొత్తపల్లి, ఎగువ కొత్తపల్లె, వినాయక నగర్‌లలో గ్రామోత్సవం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన రాము కళాకారుల బృందం కోలాటం ప్రదర్శించారు.

కార్తికేయ నగర్‌లో రూ.1.15 లక్షలు..

సుండుపల్లి: మండల కేంద్రంలోని కార్తికేయ నగర్‌లో ఏర్పాటు చేసిన గణేశ మండపంలో శనివారం నిర్వహించిన వేలంలో లడ్డూను రూ.1,15,000లకు మండల కురబ సంఘం అధ్యక్షుడు మద్దికారి జయరామ్ కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. రామయ్య నగర్‌లో మాలేపాటి హరికృష్ణ, అవినాష్ చౌదరి కుటుంబ సభ్యులు రూ.65,500 లకు, శివాజి నగర్‌లో మోహన్ నాయక్ రూ.25 వేలకు పాడుకున్నారు.

లక్కిరెడ్డిపల్లె: వినాయక చవితి సందర్భంగా మండలంలో 8 రోజులుగా గణ నాథుడికి పూజలు నిర్వహించారు. శనివారం అయప్ప గురు స్వామి వెంకటరమణ కుటుంబ సభ్యులు స్థానిక మూడురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

బలిజ చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి

రాజంపేట, సెప్టెంబరు 14 : తమ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందజేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు బలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యాసంస్థలు కృషి చేస్తాయని రాజంపేట గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ తెలిపారు. శనివారం తిరు పతిలో జరిగిన బలిజ విద్యాసంస్థల ఆత్మీయ కలయికలో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, జనసేనపార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను గుర్తించి వారికి ఫీజుల్లో రాయితీ కల్పించి ఉత్తమ శిక్షణ అందజేస్తామన్నారు. రవీంద్ర స్కూల్ కరస్పాండెంట్ రవీంద్ర, గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ హరిప్రసాద్, జనసేన నాయకులు అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల విరాళం రూ.32.49 లక్షలు



సీఎంకు చెక్ అందజేస్తున్న ఎస్జీబీ చైర్మన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకు (ఎస్జీబీ) ఉద్యోగులు తమ వేతనం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళమిచ్చారు. రూ.32.49 లక్షల మెగాచెక్‌ను బ్యాంకు చైర్మన్ ఏ.ఎస్.ఎన్.ప్రసాద్ విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి అందజేశారు.ఈసందర్భంగా బ్యాంకుఉద్యోగుల ఔదార్యాన్ని సీఎం అభినందించారు.

ఓసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీధర్‌వర్మ



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీధర్‌వర్మ

ఐరాల, సెప్టెంబరు 14: ఓసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దాట్ల శ్రీధర్‌వర్మ ఎన్నికైనట్లు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. శనివారం చిత్తూరు బ్యాన్స్ హోటల్‌లో రాష్ట్ర సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులురెడ్డిని, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.పండుదొర, పరిపాలన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా వి.సురేష్‌కుమార్, కోఆర్డినేషన్‌గా వి.మురళీకృష్ణ, అనంతరం వివిధ కమిటీలను ఎన్నుకున్నట్లు వివరించారు. శ్రీధర్ వర్మ మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఓసీ విద్యుత్ ఉద్యోగుల సమస్యపై పోరాడతానన్నారు. ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.1.08 లక్షల విరాళం



ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 14: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లెకు చెందిన లెక్కలపూడి సాంబశివనాయుడు శనివారం రాత్రి రూ.1,08,000లను చెక్ ద్వారా విరాళంగా అందించారు. దాతకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





మొగిలి ఘాట్‌లో ఉన్నత స్థాయి రవాణా సంస్థ ప్రతినిధుల బృందం - ప్రమాద స్థలంలో విరిగి వంగి పోయిన బారికేడ్లు

మొగిలి ఘాట్‌ను పరిశీలించిన ఉన్నతాధికారులు

ప్రమాదకర మలుపులు ఉండడమే కారణమన్న బృందం

పలమనేరు, సెప్టెంబరు 14 : బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఈనెల 13వ తేది జరిగిన రోడ్డు ప్రమాద ఘటనను శనివారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారుల బృందం అధ్యయనం చేసింది. ఈ బృందం మొగిలిఘాట్ చేరుకొని ఘటనా స్థలంతోపాటు ప్రమాదకర మలుపులను పరిశీలించింది. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఘాట్‌లో ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉండడమే ఈ ప్రమాదానికి కారణమన్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం లేదా నిద్రలేమి, లేదా లారీని న్యూట్రల్ చేసి కంట్రోల్ చేయలేకపోవడంతోనే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. ఘాట్‌రోడ్డుపై మలుపుల వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు కూడా సున్నితంగా ఉన్నాయన్నారు. అంతేకాక ఘాట్‌లో ఎక్కడా స్పీడ్ లిమిట్‌ను తెలియజేసే హెచ్చరిక బోర్డులను కూడా జాతీయ రహదారి అధికారులు ఏర్పాటు చేయలేదన్నారు. అందువల్లే డ్రైవర్లు అవగాహనారాహిత్యంతో అపరిమిత వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి అవుతున్నారన్నారు. ఈ బృందంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈడీ ఆపరేషన్ అధికారి చంద్రశేఖర్, డిప్యూటీ సీటీఎం శ్రీనివాసరావు, ప్రమాదాల కారణాలను గుర్తించే నిపుణలు ఎం. బాలాజి ఉన్నారు. నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నామని వారు తెలిపారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

● ఒక్కో కుటుంబానికి

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందజేసిన డీఆర్వో



మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చెక్ అందజేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 14: మొగిలి ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు మృతదేహాలకు శనివారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబీకులకు అప్పగించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేర కు కలెక్టర్ సుమిత్‌కుమార్.. డీఆర్వో పుల్లయ్య ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను సంబంధించిన చెక్‌కు వారి కుటుంబీకులకు అప్పగించారు. అలాగే తీవ్రంగా గాయపడిన పద్మావతికి వైద్య ఖర్చుల కోసం రూ.20వేలను కలెక్టర్ మంజూరు చేశారు. ఆర్టీసీ తరఫున గాయపడిన 22మందికి గాయాల తీవ్రతను బట్టి రూ.3వేల నుంచి రూ.10వేల వరకు వైద్య ఖర్చుల కోసం అందించినట్లు ఆర్ఎం రాము తెలిపారు. తీవ్రగాయాలతో సీఎంసీలో చికిత్స పొందుతున్న పద్మావతికి ఆర్టీసీ తరఫున రూ.50వేలను అందించారన్నారు. స్విమ్స్‌లో చికిత్స పొంతున్న అషతోష్ భార్య, బిడ్డకు అయ్యే వైద్య ఖర్చులను ఆర్టీసీ భరించనున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబీకులకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చే విషయాన్ని ఆర్టీసీ తరఫున ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు





పాతపేట సమీపంలో ఏనుగులు దాడిలో ధ్వంసమైన వరి - రాంపల్లె బీట్‌లో ధ్వంసమైన మామిడి చెట్లు

కల్లూరు, సెప్టెంబర్ 14: పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. మూడు రోజులక్రితం పాతపాళ్యం అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు పాతపేట సమీపానికి చేరుకొని పంటలను ధ్వంసం చేయడం ప్రారంభించాయి. శుక్రవారం రాత్రి పాతపేటలోని రైతు శంకరకు చెందిన టమోటా, వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఇదే గ్రామంలోని రైతులు మునిరాజ, జయమ్మకు చెందిన వరి, వేరుశనగ పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. కల్లూరు సమీపంలోని ముచ్చుగుట్ట నుంచి ఎద్దలవారిపల్లి సమీపం వరకు ఏనుగుల గుంపు నడిచినట్లు పాదముద్రలు కనిపించాయి.

సోమల : సోమల మండలంలో ఏనుగులు సంచరిస్తూ రైతుకు కునుకు లేకుండా చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి ఆవులపల్లె పంచాయతీ రాంపల్లె బీట్ సమీపంలోని మామిడి, వరి, వేరుశనగ పొలాల్లో తిరగాడి పంటల నష్టపరిచినట్లు రైతులు తెలిపారు. పదిరోజులుగా చిన్నఉప్పరపల్లె పంచాయతీ చెరువు కోనలో మకాం వేసిన ఏనుగులు మళ్లీ పత్రపల్లె, కొత్తూరు వైపు వచ్చాయన్నారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐదేళ్ల తర్వాత శ్రీవారి దర్శనం

పంతం వీడిన టీడీపీ నేత నరసింహయాదవ్



ఆలయం ముందు నరసింహయాదవ్ దంపతులు

తిరుమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ ఐదేళ్ల తర్వాత కుటుంబ సమేతంగా శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వైసీపీ పరిపాలనను నిరసిస్తూ గత ఐదేళ్లుగా (పార్టీ అధినేత చంద్రబాబు దర్శనానికి వచ్చినప్పుడు మినహా) ఆయన శ్రీవారిని దర్శించుకోలేదు. వైసీపీ పాలనలో అన్యాయాలు, అక్రమాలకు నిరసనగా ఆయన దీక్ష పూనారు. ప్రభుత్వం మారిన తర్వాత శనివారం తన 40వ పెళ్లిరోజు సందర్భంగా ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. దీక్షను శనివారంతో విరమించుకున్నట్లు నరసింహయాదవ్ తెలిపారు.

21.8కేజీల గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: 21.8కేజీల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో కారులో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందం నిఘా పెట్టింది. ముగ్గురు యువకులతో సహా కారును, 21.8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీనివెనుక మూలాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త జడ్పీ సీఈవో వచ్చాకే బదిలీలు

● పెండింగ్‌లో ఎంపీడీవోల లిస్ట్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 14: జిల్లాలో వివిధ శాఖల్లో బదిలీల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. జడ్పీలో ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాల కోసం ఎంపీ, ఎమ్మెల్యేల లేఖలు సమర్పించారు. గత నెల 31వ తేదిన బదిలీల ప్రక్రియ పూర్తి చేసి సెప్టెంబరు 1వ తేదికి వారు బదిలీ అయిన చోట్లలో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు ఉండకూడదని ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు బదిలీల గడువును పొడిగించింది. తిరిగి విజయవాడ వరదలు కారణంగా ఆ గడువును సెప్టెంబరు 22 వరకు పొడిగించింది. ఇంతలో జడ్పీ సీఈవో బదిలీ కావడంతో బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త సీఈవో వచ్చాకే బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

సమర్థులైన ఎంపీడీవోలకోసం ఎమ్మెల్యేల వెతుకులాట

తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చక్కబెట్టేందుకు సమర్థులైన ఎంపీడీవోల కోసం ఎమ్మెల్యేలు వెతుకులాట మొదలు పెట్టారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 మండలాలుంటే 48 మండలాలకే రెగ్యులర్ ఎంపీడీవోలున్నారు. మిగిలిన 17 మండలాలకు ఈవోఆర్డీలు, ఏవోలు ఇంచార్జ్ ఎంపీడీవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 48మంది రెగ్యులర్ ఎంపీడీవోల్లో ఒక్కరు మాత్రమే ఒకే మండలంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు.48మందిలో సొంత జిల్లాలకు బదిలీ కావాలని 13 మంది ఎంపీడీవోలు దరఖాస్తు పెట్టుకుంటే వాటిని పీఆర్ కమిషనర్ ఆమోదించారు. దీంతో 35మంది ఎంపీడీవోలు మాత్రమే జిల్లాలో మిగిలారు. దీంతో కొన్ని మండలాలకు తిరిగి ఈవోఆర్డీ, ఏవోలను ఇన్‌చార్జ్‌లుగా నియమించనున్నారు. ఈ కారణంగా ఎంపీడీవోల కొరత ఏర్పడడంతో పాటు బదిలీలు కూడా ఆలస్యమవుతున్నాయి.

కుప్పంలో ఒక్కరే విధుల్లోకి : కుప్పం సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో కలెక్టర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పనిచేసేందుకు సమర్థవంతులైన ఎంపీడీవోలను ఏరికోరి వేశారు. ఇందులో కుప్పం మండలానికి బీఎన్ కండ్రిగ ఎంపీడీవో సాయి లహరిని నియమించారు.శాంతిపురానికి వెదురుకుప్పం ఎంపీడీవోగా పనిచేసిన ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను నియమించారు. రామకుప్పం మండలానికి ఏర్పేడు ఎంపీడీవో గిడ్డయ్యను, గుడుపల్లి ఎంపీడీవోగా తాజ్‌మజూరూర్‌ను నియమించారు. ఈయన ఎన్నికల బదిలీల్లో బాగంగా వేరే జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి ఈయన్నే గుడుపల్లి ఎంపీడీవోగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కుప్పం మండలం ఎంపీడీవో సాయి లహరి తప్ప మరెవరూ విధుల్లో చేరలేదు. వివిధ కారణాలు చూపించి తమకు వేరే స్థానాలు కావాలని కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జడ్పీ సీఈవో పోస్టుకు తీవ్ర పోటీ

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. ఆ సీటుకోసం టీడీపీ ముఖ్యనాయకుల ద్వారా ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నిన్నటి వరకు రవికుమార్ నాయుడు, ఆదిశేషారెడ్డి పేర్లు విన్పిస్తుండగా తాజాగా వెంకటరత్నం పేరు తెరపైకి వచ్చింది. తిరుపతి జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న ఎం. రవికుమార్ నాయుడికి గతంలో జడ్పీసీఈవోగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయనకే ఈ పోస్టు ఖరారవుతుందని ప్రచారం జరిగింది.ప్రస్తుత జడ్పీ డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి కూడా సీఈవో పోస్టుపై కన్నేశారు. తనకు తెలిసిన టీడీపీ వర్గాల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయనకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య తక్కువే.గతంలో ఇక్కడ జడ్పీ ఏవోగా పనిచేసిన వెంకటరత్నం పేరు రెండ్రోజులుగా బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన అనంతపురం జిల్లా తాడిపత్రి డ్వామా ఏపీడీగా విధులు నిర్వహిస్తున్నారు.కలెక్టర్‌గా హరినారాయణన్ ఉన్నప్పుడు హౌసింగ్ శాఖలో పురోగతి లేదంటూ వెంకటరత్నంతో పాటు చాలామంది ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీచేస్తూ జీతాలను నిలుపుదల చేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. దాంతో వెంకటరత్నం దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.తర్వాత పదోన్నతిపై తాడిపత్రి వెళ్ళారు.ఆయనకు జనసేన పెద్దల ఆశీస్సులు మెండుగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల మాతృశాఖ రెవిన్యూకు బదిలీ అయిన జడ్పీ సీఈవో గ్లోరియా 18న రిలీవ్ కానున్నారు.ఆమె స్థానంలో ఇన్‌చార్జి సీఈవోగా డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.బదిలీలకు ఈనెల 22వ తేదివరకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

డ్వామా పీడీగా గంగాభవాని?

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 : డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న గంగాభవాని పీడీగా ప్రమోట్ కానున్నారు.మొన్నటిదాకా పీడీగా వ్యవహరించిన రాజశేఖర్‌ను ప్రభుత్వం మాతృశాఖ రెవిన్యూకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో రెండేళ్ళ క్రితం అప్పటి పీడీ చంద్రశేఖర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పీడీగా గంగాభవానీ చేరి రెండేళ్ళు పనిచేశారు. ఎన్నికల సమయంలో ఆమె స్థానంలో ప్రభుత్వం రాజశేఖర్‌ను నియమించింది. ఇదిలా వుండగా డీఆర్డీఏ పీడీ పోస్టు కోసం ముగ్గురు పోటీపడుతున్నారు. డీఎంకే తులసి ప్రస్తుతం డీఆర్డీఏ పీడీగా ఉండగా, వైసీపీ మద్ధతుదారురాలు అనే ముద్ర పడడంతో పాటు చాలాకాలంగా పనిచేస్తుండడంతో ఆమెకు స్థానచలనం అనివార్యమైంది.

నగరిలో వైసీపీ పట్టు కోల్పోతోందా?

నగరి, సెప్టెంబరు 14: నగరి నియోజకవర్గంలో రోజురోజుకూ వైసీపీ పట్టు కోల్పోతున్నట్లు కనిపిస్తోంది.పార్టీ సీనియర్ నేతలు,నగరి మున్సిపల్ మాజీ చైర్మన్లు కేజే కుమార్, కేజే శాంతిలను వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భరత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కేజే కుమార్ కుటుంబం తనకు వ్యతిరేకంగా పనిచేసిందని మాజీ మంత్రి రోజా చేసిన ఫిర్యాదుతో పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే బలమైన నేతలుగా పేర్కొనే విజయపురం మండల నాయకుడు లక్ష్మీపతిరాజు,నిండ్ర మండలంలో శ్రీశైలం ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు భాస్కర్‌రెడ్డి, పుత్తూరులో మొదలియార్ వర్గానికిచెందిన ఏలుమలై (అమ్ములు), వడమాలపేట మండలానికి చెందిన జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ఎన్నికల ముందే టీడీపీలో చేరిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరికొందరు వైసీపీ నాయకులు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం.ఈ పరిణామాల పట్ల వైసీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారం కూడా లేని సమయంలో ఇలా బలమైన నేతలను సస్పెండ్ చేసుకుంటూ పోతే పార్టీ మరింత బలహీనపడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కిట్ కళాశాలకు మంచిరోజులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: స్థానిక స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు మంచిరోజులు రానున్నాయి. మూడేళ్లుగా మూతబడ్డ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం కమిటీని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018 అక్టోబరు 26న స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేలా అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం స్కిట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించి, 2021 డిసెంబరు నుంచి తరగతులను నిలిపివేసింది. స్కిట్ కళాశాలకు పూర్వవైభవం తెస్తానని ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించాయి. మూడేళ్ల తర్వాత కళాశాలపై కదలిక రావడం పట్ల శ్రీకాళహస్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకే సర్వాధికారాలు

ఇద్దరు ఎంఈవోల స్థానంలో ఒక్కరే?



చిత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 14: కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థల్లో మార్పులు, సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సర్వాధికారాలు కట్టబెట్టేందుకు యత్నిస్తోంది. గత ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోలను తీసుకురావడంతో ఏర్పడిన గందరగోళానికి స్వస్తి పలకనుంది.

స్కూల్ కాంప్లెక్స్ సంఖ్య కుదింపు

జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న 250 స్కూల్ కాంప్లెక్స్ సంఖ్యను 170కి కుదించనుంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు పూర్తిచేశారు. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోకి కనీసం 35 మంది సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)లు ఉండేలా కేడర్ స్ట్రెంత్ ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

హెచ్‌ఎంలకు అధికారాలు

ప్రస్తుతం ఎంఈవోలకు ఉన్న ఎస్జీటీలకు సంబంధించి సర్వీసు అంశాలు, సెలవులు మంజూరు తదితర ఎగ్జిక్యూటివ్ అధికారాలన్నీ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఇవ్వనున్నారు. మండల స్థాయిలోని ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను సవరించి గతంలోవలె ఒక్క ఎంఈవోనే ఉండేలా మార్పులు రానున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఎంఈవో-2లను తొలగించడంతోపాటు, ఎంఈవో-1ని కేవలం పాఠశాల తనిఖీ అధికారిగా పరిమితం చేయనున్నారు. దీంతో ఎంఈవో-2లు ఇక పంచాయతీ రాజ్ పాఠశాల హెచ్‌ఎంలకే పరిమితం కానున్నారు.

నీటి కోసం ముందు చూపు

●రైతుల చొరవతో నిండుకుండలా సందూరు చెరువు ●సత్ఫలితాలు పొందుతున్న ఆయకట్టుదారులు


నిండుకుండలా ఉన్న సందూరు చెరువు

రామసముద్రం, సెప్టెంబరు 14: నీటిని పొదుపుగా వాడుకోవడం రామసముద్రం మండల రైతులకే తెలిసినట్లుంది. అందుకే ఎక్కడైనా చెరువులు ఆక్రమణలకు గురవుతున్న సంగతి తెలిసిందే. అయితే రామసముద్రం మండలంలో చెరువు నీటిని నిల్వచేసి పంటల తోపాటు తాగునీటికి ఇక్కట్లు లేకుండా చేసుకోవడం ఇక్కడి రైతుల ముందు చూపును అభినందించాల్సిందే. రామసముద్రం మండలంలో 208 చెరువులు ఉన్నాయి. వాటి కింద సుమారు 4662 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. మండలంలోని చెరువులలో సీతరగానిపల్లె సమీపంలోని అగ్రహారం చెరువు అత్యంత పెద్ద చెరువు కాగా చెంబకూరు సమీపంలోని కదిరాయచెరువు, మట్లవారిపల్లె సమీపంలోని సందూరు చెరువు, గొల్లపల్లె చెరువు, ఊలపాడు చెరువులు పెద్ద చెరువులుగా ఉన్నాయి. కాగా సాగునీటిని నిల్వచేసి, భూగర్భ జలాలు వృద్ధి చెందేలా చేసుకుని నీటిని భవిష్యత్ అవసరాలకు వినియోగించుకు నేలా తమ గ్రామ పరిధిలోని చెరువును రైతులు అందరూ ఉమ్మడిగా నిర్ణయం తీసుకుని చెరువు తూములను సీజ్‌చేసి నీటిని బయటకు వెళ్లిపోకుండా అడ్డుకోవడంతో సత్ఫలితాలు పొందుతున్నారు. రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీలోని మట్ల వారిపల్లె సమీపంలో సందూరు చెరువు దాదాపు 64ఎకరాలల్లో విస్తరించింది. పెద్దకుప్పల్లె, తిరుమలరెడ్డిపల్లె, కుర్రప్పల్లె, నారేపల్లె, మానేవారిపల్లె, దండోలూరు గ్రామాలకు చెందిన రైతులకు ఈ చెరువు కింద సుమారు 150 ఎకరాలు సాగు భూమి ఉంది. ఈ చెరువుకు పక్కలోనే కొన్నివేల ఎకరాల విస్తీర్ణంలో అడ్డకొండ అటవీ ప్రాంతం ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా కొండ ప్రాంతం నుంచి నీరు చెరువుకు చేరుతుంది. దీంతో ఈ చెరువు ప్రతి ఏడూ నిండుకుండలా ఉండేది. ఈ చెరువు ఆయకట్టు కింద 150 ఎకరాలలో రైతులు ప్రతి ఏటా వర్షాకాలంలో వరితోపాటు వేసవి కాలంలో బోరుబావుల సాయంతో పంటలు సాగు చేసేవారు. ఈనేపథ్యంలో 2012 నుంచి 2014 వరకు వర్షాలు సరిగా పడకపోవడంతో ఈ చెరువు కింద పంటల సాగు పూర్తిగా తగ్గిపోయింది. బోరుబావులలో కూడా నీటి మట్టం తగ్గిపోయి బోర్లు సైతం ఎండిపోయాయి. రైతులు అందరూ కలిసి చెరువు నీటిని వాడుకోకుండా 2015లో చెరువులో చేరిన నీటిని తూముల ద్వారా బయటకు వెళ్లకుండా బ్లాక్‌చేశారు. దీంతో భూగర్భ జలాలు పెరగడంతోపాటు ఇప్పటి వరకు చెరువు నీటితో కళకళలాడుతోంది. బోర్లలో కూడా నీటిమట్టం పెరిగి ఏడాదిపాటు పంటలు సాగు చేస్తున్నారు.

పంచాయతీకి లక్షల్లో ఆదాయం



సందూరు చెరువు సీజ్ వల్ల చెరువులో ఎప్పుడూ నీళ్లు ఉండ డంతో పంచాయతీ తరపున చేపల పెంపకం చేపట్టాం. ప్రతి ఏడూ చెరువులో చేపల వేలం వల్ల లక్షల్లో ఆదాయం వస్తోంది. ఈ నిధులతో గ్రామాల్లో వివిధ అబివృద్ధి కార్యక్రమాలు చేపడుతు న్నాం.

-రెడ్డెప్పనాయుడు, గ్రామ సర్పంచ్

గ్రామస్థుల ముందుచూపు సత్ఫలితాలిస్తోంది



భవిష్యత్తులో తాగు, సాగు నీటి కొరత రాకుండా గ్రామస్థుల ముందుచూపుతో చెరువు సీజ్ చేయడం సత్ఫలితాలు ఇస్తోంది. అప్పుడు సర్పంచ్‌గా ఉన్న నాకు రైతుల నిర్ణయం ఎంతో సంతోషాన్ని కలిగించింది. గత ఏడేళ్లుగా సందూరు చెరువు నీటితో కళకళలాడుతోంది.

-రెడ్డిశేఖర్, మాజీ సర్పంచ్

ఏడాదికి రెండు పంటలు వరి సాగు చేస్తున్నాను



నాకు ఈ చెరువు కింద రెండు ఎకరాల భూమి ఉంది. చెరువు సీజ్ చేయక ముందు చెరువు నీటిని వాడడం వల్ల ఏడాదికి ఒకసారి వరిసాగుచేసేవారం. కానీ ఇప్పుడు నీటిని చెరువులో నిలపడం వల్ల బోరు బావుల్లో నీటి మట్టం పెరిగి ఏడాదికి రెండు పంటలకు నీరు పుష్కలంగా అవుతున్నాయి.

-మంజునాథ్, రైతు

ఆపన్నులను ఆదుకోవడం చంద్రబాబుకే సాధ్యం


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 14: వరద బాధితులను ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఫొటోలకు టీడీపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేసిన టీడీపీ నాయకులు మాట్లాడుతూ గతంలో విశాఖలో హుద్‌హుద్ తుఫాను వచ్చినప్పుడు బాధితులను వారం రోజుల్లోనే ఆదుకున్న సీఎం చంద్రబాబు, యుద్ధ ప్రాదిపతికన సహాయ చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. ఇప్పడు విజయవాడలో వరద బాధితులను కూడా చంద్రబాబు ఆదుకోవడంలో ముందున్నారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మూడు లారీల సరుకులు, వస్తువులు తీసుకెళ్లి విజయవాడలో వరద బాధితులకు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, జేసీబీ వేణు, రాయచోటి శశికుమార్, మధుసూధన్‌రెడ్డి, ఎస్.సుధాకర్, నవీన్‌చౌదరి, వినోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించడంపై హర్షం


ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న పీలేరు ఎక్సైజ్ సిబ్బంది

పీలేరు, సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించినందుకు పీలేరులోని ఎక్సైజ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆమేరకు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఎక్సైజ్ సీఐ శ్యాం ప్రసాద్, ఎస్‌ఐలు లక్ష్మీనరసయ్య, కవీశ్వర నాయుడు, సిబ్బంది శేఖర్, సుధాకర, రమేశ్, చందు, నాగేంద్ర, శివ, సుదర్శన్ రావు, సునీల్, సుకుమార్, కుళ్లాయప్ప, వేణు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్ఈబీని తిరిగి ఎక్సైజ్ ప్రొహిబిషన్‌గా పునరుద్ధరించడం పట్ల స్థానిక అధికారులు, సి బ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ సునంద, ఎస్ఐ షేక్ షావలి, హెచ్‌సీ రత్నం, చలపతి, సుందరం, ఇస్మాయిల్, రెడ్డెయ్య, మంజుల, శోభారాణి పాల్గొన్నారు.

పరిహారం అందేవరకు ఎన్‌హెచ్ పనులు ఆపాలి


రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14: నష్టపరిహారం అందే వరకు జాతీయ రహదారి(ఎన్‌హెచ్) చేపట్టరాదని భూబాధితులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె బైపాస్ వద్ద ఎన్‌హెచ్ రోడ్డు పనులు మొదలు పెట్టడంతో భూబాధితులు వాటిని అడ్డుకుని రాస్తారోకో చేశారు. 15 ఇళ్లకు ప్రభుత్వం నుంచి పరిహారం ఏమి రాలేదని, అధికారులు వచ్చి మాతో సంప్రదించి, మాకు నష్ట పరిహారం అందేవరకు రోడ్డు పనులు నిర్వహించారాదని బాధితులు రోడ్డుపై ధర్నా చేశారు. ఉదయాన్నే రోడ్డు పనులంటూ మురుగునీటి పైపులు, తాగునీటి పైపులు, కరెంటు వైర్లులాగేయడంతో ఉద్యోగులు, చిన్న పిల్లలు కరెంటు లేక ఇబ్బందులు పడ్డారు. చెట్టు నరకడం, పైపులు తొలగించడం ఆపాలని వారు కోరారు. అనంతరం ఎన్‌హెచ్ అధికారి వెంకటేష్‌తో వాగ్వాదానికి దిగ్గారు. పనులు ఆపేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎన్‌హెచ్ అధికార సర్ది చెప్పడంతో ఆందోళన సర్దుమణిగింది. ఈ కార్యక్రమంలో భూబాధితులు సాలమ్మ, ఉమా, శివాజమ్మ, నేత్ర, చంద్ర, కమలమ్మ, మహేష్, ఇందిరమ్మ, ప్రణీత, వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రమ్మ, సుబ్రహ్మణ్యం, రామ కృష్ణ, సత్యనారాయణ, వసంత, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పీలేరు డిగ్రీ కళాశాలకు పరిశోధన ప్రాజెక్టు మంజూరు

పీలేరు, సెప్టెంబరు 14: పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వ పరిశోధన ప్రాజెక్టు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి తెలిపారు. 'పర్యావరణ పర్యాటకం సుస్థిరాభివృద్ధి-ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక కేంద్రాలపై' తమ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం అధ్యాపకుడైన డాక్టర్ ఎం.వెంకటరమణయ్య ఒక అధ్యయనం చేసి సమర్పించిన పరిశోధనా ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) ఆమోదించిందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. పరిశోధన ప్రాజెక్టు కోసం రూ.24 లక్షల నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. ఈ పరిశోధన ప్రాజెక్టు రాష్ట్రంలోని పర్యావరణ పర్యాటకం(ఎకో టూరిజం) అబివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ ఒక ఏడాదిలోపు ప్రాజెక్టును పూర్తి చేసి ఐసీఎస్ఎస్ఆర్‌కు సమర్పించనున్నట్లు తెలియజేశారు. ప్రతిష్టాత్మకమైన పరిశోధన ప్రాజెక్టును తమ కళాశాలకు తెచ్చినందుకు .వెంకటరమణయ్యను ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల అధ్యాపకులు అభినందించారు.

మాజీ సీఎం కిరణ్‌ను కలసిన బీజేపీ నాయకులు


మాజీ సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నేత సేతు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 14: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ నేత నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని మదనపల్లె బీజేపీ నాయ కులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మదనపల్లె విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్, బీజేపీ నాయకుడు ఎన్.సేతు కలసి శుభాకాంక్షలు తెలిపారు. కిరణ్‌కు శాలువ కప్పి, వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన నల్లారితో చర్చించారు.

ఘనంగా ముగిసిన జాతీయ యోగా మీట్


విజేతలకు ట్రోఫీ అందిస్తున్న డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14: మదనపల్లె నవోదయలో గత మూడు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ యోగా మీట్ శనివారంతో ముగిసింది. ఇందులో చివరిరోజు నిర్వహించిన రిథమిక యోగా కనువిందు చేసింది. ఒక పాటకు నృత్యం చేస్తూ విద్యార్థులు వేసిన ఆసనాలు అబ్బురపర్చాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా నవోదయ విద్యాలయ సమితి రీజనల్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ హాజరయ్యారు. 7207.5 పాయింట్లతో హైదరాబాద్ రీజియన్ మొదటి స్థానం కైవసం చేసుకుంది. 7001 పాయింట్లతో జైపూర్ రీజియన్ రెండవ స్థానం, 6945.5 పాయింట్లతో భోపాల్ రీజియన్ మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు ముఖ్య అతిథి ట్రోఫీ, బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో జవహర్‌నవోదయ వలసపల్లె, బెంగళూరు రూరల్ సత్యసాయి జిల్లా ప్రిన్సిపాళ్లు గోవిందరావు, చక్రవర్తి, నాగరాజ్‌లు పర్యవేక్షించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మిట్స్ విద్యార్థులకు ఏఐసీటీఈ స్కాలర్‌షిప్పులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌ప్రిన్సిపాల్ పాల్ కమాల్‌బాషా

కురబలకోట, సెప్టెంబరు 14: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులకు ఏఐసీటీఈ జాతీయస్థాయి స్కాలర్‌షిప్పులు మంజూరైనట్లు శనివారం వైస్‌ప్రిన్సిపాల్ కమాల్‌బాషా పేర్కొన్నారు. కళాశాలలో బీటెక్ ఫైనలియర్‌కు చెందిన 117మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50,000 చొప్పున స్కాలర్‌షిప్పులు మంజూరయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభా స్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, అత్తర్ సమీనాఖాన్, మౌలాలి తదితరులు అభినందించారు.

గ్యాస్ వినియోగదారులు విధిగా ఓటీపీ చెప్పాలి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 13: గ్యాస్ వినియోగదారులు సిలిండర్ బుకింగ్ చేశాక రిజిస్టర్ మొబైల్‌కు వచ్చే నాలుగంకెల ఓటీపీని తప్పనిసరిగా డెలీవరీ బాయ్‌కు చెప్పాలని, అప్పుడే సిలిండర్ ఇస్తారని గ్యాస్ ఏజెన్సీ తంబళ్లపల్లె నిర్వాహకుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిలిండర్ల డెలివరీ సరిగ్గా ఉండటానికి కంపెనీ ఈ విధానం తెచ్చినట్లు తెలిపారు. ఒకవేళ ఫోన్ నెంబరు అప్‌డేట్ కాకపోతే స్థానిక గ్యాస్ కార్యాలయంలో కానీ, డెలివరీ బాయ్ వద్ద కానీ అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపారు. వినియోగదారులు డెలీవరీ బాయ్‌కు ఓటీపీ చెప్పి సహకరించాలని కోరారు.

ఆటోలో నుంచి జారిపడి బాలుడు మృతి

కురబలకోట/తంబళ్లపల్లె, సెప్టెంబరు 14 ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి బాలుడు అక్షయ నాయక్(10) మృతి చెందిన దుర్ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు..తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండాకు చెందిన మహేష్ నాయక్, రెడ్డమ్మ దంపతుల కుమారుడు అక్షయనాయక్ పుంగనూరులో చదువుతున్నాడు. వినాయకచవితి పండుగకు ఇంటికి వచ్చిన కొడుకును తిరిగి పాఠశాలలో వదిలేందుకు తల్లిదండ్రులు అక్షయ్‌ను వారి ఆటోలో పిలుచుకుని వెళుతున్నారు. ఈ క్రమంలో కురబలకోట మండలం దాదంవారిపల్లె వద్ద గుంతల రోడ్డు ఉండటంతో ఆటో నడుపుతున్న తండ్రి పక్కనే కూర్చున్న అక్షయ ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారి కింద పడి గాయపడ్డాడు. వెంటనే బాలుడిని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. బాలుడు కళ్లేదుటే తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేస్తూ కూలీ మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14: మండల పరిధిలో గోళ్లపల్లె వద్ద జరుతున్న హైవే రోడ్డు పనులలో శనివారం టిప్పర్ నుంచి కంకర్ దింపుతుండగా కంకర మీదపడి అనిల్‌కుమార్ (50) అనే కూలీ మృతి చెందాడు. బి. కొత్తకోట పోలీసుల వివరాల మేరకు గోళ్లపల్లెవద్ద కంకర్ అన్‌లోడు చేస్తుండగా బీహార్‌కు చెందిన అనిల్‌కుమార్ కంకర మీదపడి గాయపడ్డాడు. వెంటనే అతన్ని వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. బి. కొత్తకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

వాల్మీకిపురం, సెప్టెంబరు 14: దోమలను నివారించడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని వాల్మీకిపురం మండలం చింతపర్తి వైద్యాధికారిణి శ్రీవిద్య పేర్కొన్నారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని గండబోయనపల్లె గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఫ్రైడేని డ్రైడేగా పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రణ చేయవచ్చన్నారు. ప్రతి రోజూ ఇంటిలో సాయంత్రం పచ్చివేపాకు పొగవేసుకో వడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలవృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రథమ చికిత్స దినోత్సవం

వాల్మీకిపురం, సెప్టెంబరు 14: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నపాఠశాలలో చిత్తూరు 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ వారి ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ కేర్ టేక్ ఆఫీసర్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి, ఏఏ ప్రమాదాలకు ఎలా స్పందించాలి అనే ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి పాఠశాలలో ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం

గుర్రంకొండ, సెప్టెంబరు 14:మండలంలోని తరిగొండలో శనివారం టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ సందర్భంగా 500 మందికి అన్నదానం చేశారు. నాయకులు చంద్రబాబు, నారాయణ, రాజన్న, మహాత్మారెడ్డి, నౌషాద్‌అలీ, రెడ్డెప్ప రెడ్డి, ఎస్.వెంకటరమణ, హేస్సాన్, వేణు, రమణారెడ్డి, గంగులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 184 కేసులు పరిష్కారం


లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సెకండ్ ఏడీజే అబ్రహాం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 14: మదనపల్లె కోర్టు భవనాల సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 184 కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం సెకండ్ ఏడీజే బి.అబ్రహాం ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 63 సివిల్ కేసులు, 121 క్రిమినల్ కేసులు ఇరు కక్షిదారుల రాజీతో పరిష్కారమయ్యాయి. ఈ కేసుల్లో రూ.3.42కోట్లు బాధితులకు పరిహారం అందింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.వెంకటేశ్వర్లునాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్‌రెడ్డి, స్పెషల్ మెజిస్ట్రేట్ ఎస్‌వీ చలపతి, పోలీసులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో:తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 82 కేసులు పరిష్కారం అయ్యాయి. ఇందులో బాధితులకు రూ.49,45,750 పరిహారం చెల్లించారు. జడ్జి ఉమర్‌ఫరూఖ్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

రాజీ మార్గానికి చక్కటి వేదిక లోక్‌అదాలత్


వాల్మీకిపురంలో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గురుఅరవింద్

వాల్మీకిపురం, సెప్టెంబరు 14: కేసులతో జీవితాలను దుర్భరం చేసుకోకుండా రాజీమార్గం ద్వారా సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక లోక్‌అదాలత్ అని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురుఅరవింద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్‌అదాలత్‌లోనే కాకుండా కోర్టులో నిరంతరం ప్రీ సిట్టింగ్ నిర్వహించడం జరుగుతుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు తదితర మొత్తం 76 కేసులను,నగదు రు.65,06,470లు రికవరీలు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, లోక్‌అదాలత్ సభ్యులు, పోలీసులు, బ్యాంకుల అధికారులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకులు పంపిణీ


విజయవాడలో వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులకు మూడో రోజు కూడా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా సరుకులు పంపిణీ చేశారు. శనివారం విజయవాడ ఊర్మిళ నగర్‌లోని 43వ డివిజన్‌లో రాత్రి పొద్దుపోయే వరకు వస్తున్న వరద బాధితులకు షాజహాన్‌బాషా సరుకులు, గ్యాస్ స్టౌవ్‌లు, రెగ్యులేటర్లు, గ్యాస్ పైపులు, వంట పాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విద్యాసాగర్, మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జున గాంధి, బాలుస్వామి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



వాల్మీకిపునం, సెప్టెంబరు 14: వాల్మీకిపు రం పట్టణంలోని ఇం దిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం విగ్రహాల వద్ద విశేష పూజలు నిర్వ హించి పట్టణ పురవీ దులలో నగరోత్సవం అనంతరం నిమజ్జనానికి తరలి వెళ్లారు. అలాగే స్థానిక తోటవీధి, కొత్తపేటవీధులలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల వద్ద పూజలు అనంతరం భక్తులకు అన్న, ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో ఉత్సవ కమిటీల సభ్యులు, యువత, మహిళలుపాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ పనిచేయక వినియోగదారుల ఇక్కట్లు

ములకలచెరువు, సెప్టెంబరు 14: బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సరిగా పనిచేయక వినియోగదారులకు ఇక్కట్లు పడుతున్నారు. సాంకేతిక కారణాలతో సిగ్నల్ సమస్య కారణంగా తరచూ కాల్ కట్ అవుతోందని అలాగే ఫోన్ చేసినప్పుడు ఎదుటి వారి ఫోన్‌లో వాయిస్ వినపడడంలేదని దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ టెలికామ్ సంస్థలు భారీగా తమ టారీఫ్‌లను పెంచడంతో చాలా మంది బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అవుతున్నారు. దీంతో టవర్ సామ్థ్యం సరిపోక సమస్య ఏర్పడి ఉండవచ్చని పలువురు వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ కూడా ఊరికి దూరంగా ఉండడంతో సిగ్నల్స్ అంతంత మాత్రంగా వస్తున్నాయని దీంతో ఇళ్లలో ఉన్న సమయంలో టవర్ సిగ్నల్ తక్కువగా వస్తుండడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకుని సిగ్నల్ సమస్యను పరిష్కరించడంతో పాటు ఊరి మధ్యలో టవర్ ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

కమనీయం.. వరసిద్ధి వినాయకుడి కల్యాణం


సిద్ధి,బుద్ధి సమేత వినాయకుడు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు14: స్థానిక పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేవుట్‌లో వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం కమనీయం, కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం ముందుగా ఆలయకమిటీ సభ్యులు ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ, గాజులను అందజేశారు. వినాయక స్వామి మూడు లడ్డులు, మూడు టెంకాయలను వేలం నిర్వహించారు. అందులో వీరభద్రారెడ్డి,రూ. 19 వేలకు, వెంకటరమణ రూ. 7 వేలకు, మోడెం వెంకటరమణ రూ. 6300లకు దక్కించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. దాతలలు ఆలయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం పుష్పపల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు సిద్దులు, గౌరవాధ్యక్షుడట కాలా సోముశేఖర్, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ. 50,116

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు14: పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో శనివారం వినాయకుడి ఊరేగింపు సందర్భంగా లడ్డు వేలంపాట నిర్వహించగా కాలనీకి చెందిన బార్గవ్ రూ. 50,116 సొంతం చేసుకున్నారు. స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జితేంద్రరెడ్డి, సాయి, జిత్తు, హేము, కౌస్చిక్, తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:మండలంలోని కోటగుడిబండలో రావిమానుయువసేన ఆధ్వర్యంలో వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన 10 కిలోల లడ్డుకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన పరసా శివయ్య రూ.35వేలు వెచ్చించి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం గణనాథుడిని ప్రత్యేక అలంకరించి పురవీధులో ఊరేగించి నిమజ్జనం చేశారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

గుర్రంకొండ, సెప్టెంబరు 14:గుర్రంకొండ మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు



కలకడ, సెప్టెంబరు 14:మండలం లోని బాటవారిపల్లెలో కొలువైన పం చముఖ ఆంజనేయస్వామి ఆల యంలో శనివారం స్వామి వారికి విశేష పూజలను చేశారు. ఈ సంద ర్భంగా వేకువ జామునే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అనంతరం నైవేద్యం సమర్పించి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆల యానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నలుగురు ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14:స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నలుగురు ఉపాధ్యాయులు కలాం విజన్, జాతీయ స్థాయి అవార్డులను అందుకున్నారు. ఇందులో ఉపాధ్యాయులు పఠాన్ మహమ్మద్ ఖాన్, ఆర్‌వీ రమణ, షేక్ ముబారక్, ఎల్. బాబాజాన్, కలాం విజన్ యువతేజం ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని విశ్వంకళాశాల్లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ మనువడు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ ఉత్తమ అవార్డు రావడంతో తమకు మరింతబాధ్యత పెంచిందన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయులు, విద్యాధికారులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ములకలచెరువు మండలం బురకాయకోట హైస్కూల్‌లో పని చేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు షేక్ మాల్‌బాషాకు తిరుపతి యువతేజం ట్రస్టు, కలాం విజన్ ఆధ్వర్యంలో ఆచార్య దేవోభవ నేషనల్ పురస్కారంను శనివారం అందుకున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 5న ఉధ్యాయుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతులు మీదుగా కమాల్‌బాషా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. కాగా ఆచార్యదేవోభవ కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు సుబ్రహ్మణ్యం శర్మ, కళావిజన్ ఫౌండర్ డాక్టర్ కరీముల్లా, ద్రావిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్ రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అబూబక్కర్‌కు భారత సేవారత్నా అవార్డు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14: బెంగళూరులోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా మదనపల్లె పట్టణంలోని హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్‌కు విశిష్ట గౌరవ జాతీయ భారత సేవా రత్నా అవార్డును అందించారు. కార్యక్రమంలో సభ్యులు కిరణ్, నవీన్, సుకుమార్, పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు

పీలేరు, సెప్టెంబరు 14: పీలేరు పట్టణం కోటపల్లెలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం 'కోర్' స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రాజెక్టు మేనేజర్ రాజమ్మ మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణ, నియంత్రణపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో 'కోర్' సంస్థ సభ్యులు షర్మిళ, రెడ్డిరాణి, గురుకులం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.